Follow: @ANNTELUGU
ANN తెలుగు
19-11-2024
# మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 306 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/9316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నేరెళ్ల, లగచర్ల ఘటనలు ఒక విశ్లేషణ!

లగచర్ల లాగా నేరెళ్ల ఘటనలో రాజకీయాలు లేవు. మావోయిస్టులు ఆ ఘటనలో లేరు. కేవలం నాటి అధికార పార్టీ నాయకుల అక్రమాలను ప్రశ్నించిన పాపానికి 8 మంది దళితులను ఎంత క్రూరంగా హింసించారో మాటల్లో చెప్పలేం. కానీ ఇదివరకెన్నడూ చరిత్రలో జరగని సంఘటన లాగా బిఆర్ఎస్ మాధ్యమాలు,లగచర్ల ఘటనను ముడిసరుకుగా మార్చుకున్నవి.'పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తలు ఏమయ్యారు? కోదండరాం ఎటు పోయారు? ప్రజా సంఘాల నోరు ఎందుకు మూతపడింది'?.. అంటూ ఆ మాధ్యమాలు ఘోషిస్తున్నవి.

సీనియర్ జర్నలిస్ట్ ఎస్.కె.జకీర్ విశ్లేషణ.. 4లో

భక్తి

## శ్రీవాణి ట్రస్ట్ రద్దు

- టీటీడీ సంచలన నిర్ణయాలు
- సామాన్య భక్తులకు రెండు గంటల్లోనే దర్శనం



02

ప్రగతి

## వేములవాడ రాజన్నకు రూ.127 కోట్లు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ సర్కార్
- ఈ నెల 20న వేములవాడకు సీఎం



02


కల్తీ

## కల్తీ ఆహారానికి కేరాఫ్ ఖమ్మం..!

- ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ దాడులు
- విస్తుపోయే నిజాలు




03



## వైల్డ్ ఫైర్

### పుష్ప-2పై జక్కన్న రియాక్షన్

అభిమానులను ఉర్రూతలూగిస్తున్న పుష్ప-2 ట్రైలర్‌పై దర్శకధీరుడు రాజమౌళి కూడా స్పందించారు. "పాట్నాలో వైల్డ్ ఫైర్ మొదలైంది!!. దేశమంతటా విస్తరిస్తోంది!!. డిసెంబర్ 5న పేలుతుంది!!. పార్టీ కోసం వేచిచూడలేను పుష్ప!!" అని రాజమౌళి అన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు.



## రామ్ గోపాల్ వర్మకు హైకోర్టులో ఎదురుదెబ్బ.!

**మహా, సినిమా:** టాలీవుడ్ వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ వర్మ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. గత వారం రామ్ గోపాల్ వర్మపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పోలీస్ స్టేషన్‌లో ఐటీ చట్టం కింద వర్మపై కేసు నమోదు చేశారు పోలీసులు.

మిగతా 8లో

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 76,310 |
| 22 క్యారెట్ | 69,950 |
| సిల్వర్ (కేజీ) | 89,500 |

### స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ ↗ | 77,339.01 |
| నిఫ్టీ ↗ | 23,453.80 |

### ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 210 | 230 |

హోల్ సేల్ ధర ₹

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

### ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ ₹ | ట్రే ₹ |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.45 | 163.5 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.45 | 163.5 |
| రిటైల్ గుడ్డు ధర | 5.78 | 176.58 |





# విజయోత్సవాల బాట

## నేడు వరంగల్‌లో భారీ సభ

సీఎం రేవంత్ రెడ్డి సహా కీలకమంత్రులు హాజరు

నేడు కాళోజీ కళాక్షేత్రం ప్రారంభం

22 జిల్లాల్లో ఇందిరా మహిళాశక్తి భవనాలు

"అధికారంలోకి వచ్చిన ఏడాది సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంబరాలకు సిద్ధమైంది. ప్రజాపాలన ప్రజా విజయోత్సవం పేరుతో మంగళవారం ఓరుగల్లు వేదిక భారీ సభ నిర్వహిస్తోంది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శాఖల వారీగా నివేదికలు ఇచ్చేందుకు ప్రభుత్వ శాఖలు సిద్ధమయ్యాయి. ఈ 12 నెలల్లో ఏం జరిగిందో ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించబోతున్నారు.

- హైదరాబాద్, మహా

### వైఫల్యాల వేట

బిజెపి, కాంగ్రెస్ కార్యక్రమాల జోరు

విపక్ష బిఆర్ఎస్, బిజెపి కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల వేట కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. డిసెంబర్ 1 నుండి రేవంత్ రెడ్డికి బిజెపి అంటే ఏంటో చూపిస్తామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. మరోవైపు ఛాన్స్ తీసుకుని మరీ సందర్భం ఉన్నా లేకున్నా విమర్శలదాడి కొనసాగిస్తున్న బిఆర్ఎస్ లగచర్ల ఎపిసోడ్ ను హస్తినకు తీసుకెళ్ళింది. అటు బిజెపి, ఇటు బిఆర్ఎస్ రెండూ కాంగ్రెస్ టార్గెట్ గా దూకుడు కొనసాగిస్తున్నాయి.

## సొంత నియోజకవర్గంలో పర్యటించనివ్వరా?

### భగ్గుమన్న ఎంపీ డీకే అరుణ

రాజీనామా చేసి కొడంగల్ నుంచి పోటీచెయ్.. చూసుకుందాం

లగచర్ల బయల్దేరిన డికె అరుణ, ఈటల, ఏలేటి అరెస్ట్

పోలీసులతో అరుణ, ఈటల వాగ్వాదం

భగ్గుమన్న కాషాయశ్రేణులు... లగచర్ల సెగలు



**హైదరాబాద్, మహా:** ఎంపీగా నా సొంత నియోజకవర్గంలో పర్యటించనివ్వరా? తెలంగాణలో ప్రజాస్వామ్యం ఉందా? చచ్చిపోయిందా? అంటూ మహబూబ్ నగర్ ఎంపీ డికె అరుణ పోలీసులపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం సంగారెడ్డి జైలులో ఉన్న లగచర్ల దాడి నిందితులను పరామర్శించిన ఎంపీలు డికె అరుణ, ఈటల రాజేందర్ లు, బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డితో కలిసి లగచర్ల బయలుదేరగా మొయినాబాద్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. లగచర్ల పర్యటనకు వెళ్లకుండా అడ్డగించి అదుపులోకి తీసుకున్నారు.

మిగతా 2లో



## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ?

### కాశ్మీర్ బాటలో కేంద్రం

మణిపూర్‌లో శాంతిస్థాపనకు కేంద్రం జమ్మూకాశ్మీర్ వ్యూహాన్ని అమలు చేసే యోచనలో ఉంది. ఇందుకోసం ఏడాది గడువును నిర్దేశించుకుంది. కొత్త సీఎంను నియమించడం లేదా రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్రం భావిస్తోంది. ముందు కుకీ మిలిటెన్సీ అధికారులను గుర్తించి వ్యవస్థ ప్రక్షాళన చేయనున్నది. సాయుధ బలగాలతో కుకీ టెర్రరిస్టులను ఏరివేస్తూ మయన్మార్ బోర్డర్ ను పటిష్టంగా మార్చనుంది. సోమవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షా మణిపూర్ ఘటనలపై హై లెవల్ మీటింగ్ నిర్వహించారు.

## లగచర్లపై ప్రధాని, రాహుల్ స్పందించాలి

### కాంగ్రెస్‌ను అస్థిరపరిచే ఉద్దేశం లేదు

ఐదేళ్ళు రేవంతే సీఎం.. ఆ తర్వాత మాదే అధికారం

లగచర్లది రిమాండ్ రిపోర్ట్ కాదు.. డిమాండ్ రిపోర్ట్

ఢిల్లీలో మీడియా సమావేశంలో కేటీఆర్



**ఢిల్లీ, మహా:** మణిపూర్, లక్షద్వీప్ కంటే లగచర్ల ఘటన చిన్నదేమీ కాదని.. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు డిమాండ్ చేశారు. లగచర్ల బాధితులతో కలిసి ఆయన జాతీయ మానవహక్కుల సంఘాన్ని కలిశారు. అనంతరం బాధితులతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో


## రాజకీయాలకు గుడ్ బై

.. ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ప్రకటన

02

బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్

## కొణతం దిలీప్ అరెస్ట్



**హైదరాబాద్, మహా:** సోషల్ మీడియాలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొణతం దిలీప్‌ను సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ మీడియా హెడ్‌గా కొణతం దిలీప్ వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రేవంత్ సర్కారే లక్ష్యంగా

మిగతా 2లో

## ఎవరో ఒక్కరే ఉండాలి..

### ఘన్‌పూర్ నుంచి తరిమే దాక నిద్రపోను

నువ్వు దళిత ద్రోహివి.. ఎమ్మెల్యే కడియంపై రాజయ్య ఫైర్

ఇద్దరి మధ్య ముదురుతున్న మాటల యుద్ధం

**వరంగల్, మహా:** ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నేత రాజయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మరోవైపు తెలంగాణలోనే స్టేషన్‌ఘన్‌పూర్ రాజకీయాలు హాట్‌హాట్‌గా మారాయి. నియోజకవర్గంలో రాజయ్య, కడియం శ్రీహరి మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల రాజయ్య చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను కడియం శ్రీహరి తప్పుబట్టారు.

మిగతా 2లో





## కేటీఆర్ బీజేపీ అద్దె మైకు

టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్స్ చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి

వివరాలు 3లో

# విజయోత్సవాల బాట



హైదరాబాద్, మహా: అధికారంలోకి వచ్చిన ఏడాది సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంబరాలకు సిద్ధమైంది. ప్రజాపాలన ప్రజా విజయోత్సవం పేరుతో మంగళవారం ఓరుగల్లు వేదిక భారీ సభ నిర్వహిస్తోంది. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శాఖల వారీగా నివేదికలు ఇచ్చేందుకు ప్రభుత్వ శాఖలు సిద్ధమయ్యాయి. ఈ 12 నెలల్లో ఏం జరిగిందో ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించ బోతున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించ డంతో పాటు పలు అభివృద్ధి పథకాలకు శ్రీకారం చుడతారు. ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ లో నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడుతారు. స్వయం సహాయ బృందాల మహిళలతో సమావేశమై ఆ గ్రూపులకు సంబంధించిన ఆస్తుల పంపిణీ చేస్తారు. వరంగల్, మహబూబ్‌నగర్, కరీంనగర్ జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తున్నారు. ఈ సభల్లో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అలాగే డిసెంబరు 9న సచివాలయం ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. మహిళల సాధికారత, రైతుల సంక్షేమం, యూత్ ఎంపవర్‌మెంట్‌కు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిన నేపథ్యంలో వాటిపై వివిధ కార్యక్రమాలు చే పట్టాలని నిర్ణయించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్, సచివాలయం, నెక్లెస్‌రోడ్ పరిసరాల్లో విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

### ఎన్నో సంచలనాలు

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏడాదికాలంలోనే అనేకరం గాల్లో తనదైన మార్కు వేసుకుంది. ఉద్యోగాల కల్పన లో తిరుగులేని రికార్డు సొంతం చేసుకుంది. ఏడాది వ్యవధిలో 50వేలకు పైగా ఉద్యోగ నియామకాల పత్రాలు ఇవ్వడం దేశంలోనే రికార్డు. పోటీ పరీక్షల నిర్వహణలో, నియామకాల్లో ఈ ప్రభుత్వం గత ప్ర భుత్వాలకంటే భిన్నమైనదని రుజువైంది. రుణమాఫీ సాహసం చేసింది. ఏకకాలంలో 18వేల కోట్లకు పైగా మాఫీ చేయడం ఏ రాష్ట్ర ప్రభుత్వం సాహసించ నిది. కానీ రేవంత్ సర్కార్ ఈ పని చేసింది. మహిళల కు ఉచిత బస్సు, 500కే గ్యాస్, 200 యూనిట్ల లోపు ఫ్రీ కరెంట్ వంటి పథకాలన్నీ అమలవుతున్నాయి. పెట్టుబడుల ఆకర్షణలో పాత ఒరవడి కొనసాగుతుం డగా, రైతులకు సన్నవడ్లకు బోనస్ ప్రకటించింది.

### ఇదీ షెడ్యూల్

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల వేడుకలలో వరంగల్ జిల్లా కేంద్రంగా పాల్గొననున్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ ను ఈ మేరకు ఖరారు చేశారు. మంగళవారం వరంగల్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన 2.30కు కూడా గ్రౌండ్స్ హెలిపాడ్ ప్రాం తానికి చేరుకోవడంతో ప్రారంభమవుతుంది. అక్కడి నుంచి 2 గంటల 30 నిమిషాల నుంచి మూడు గంటల 10 నిమిషాల వరకు కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తారు. ఆపై అక్కడ ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యా లరీని సందర్శిస్తారు. తర్వాత ఆర్ట్స్ కళాశాలకు రోడ్డు మార్గంలో వెళతారు. 22 జిల్లాలలో ఇందిర మహిళా శక్తి భవనాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం ట్రాన్స్ జెండర్ క్లినిక్ లను ప్రారంభిస్తారు. వీటితోపా టు పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటారు. అనంతరం నాలుగు నెలల నుండి 4 గంటల 40 నిమిషాల వరకు డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడుతారు. 4 గంటల 40 నిమిషాల నుండి 5 గంటల వరకు సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు.

### సక్సెస్ మంత్ర

- 50 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు
- 2 లక్షల రుణమాఫీ
- మహిళలకు ఫ్రీ బస్
- సన్నవడ్లకు బోనస్
- జాబ్ క్యాలెండర్.. పరీక్షల నిర్వహణ

### నాలుగు ప్రణాళికలు

తెలంగాణ అభివృద్ధి గురించి సీఎం రేవంత్ పూర్తి విజన్ తో ఉన్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా ఏ కార్యక్రమంలో పాల్గొన్నా తాము పెట్టుకున్న లక్ష్యాలు తీసుకుంటున్న చర్యల గురించి వివరిస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో ఓ కాంక్లేవ్ లో పాల్గొన్న సీఎం... నాలుగు భవిష్యత్ లక్ష్యాల గురించి చెప్పారు. అందులో ఒకటి ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్, మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్స్ వంటివి పూర్తి చేసి తీరుతామన్నారు. ఈ నాలుగు ప్రణాళికలు తెలంగాణ భవిష్యత్తును మార్చబోతున్నాయి.

# సొంత నియోజకవర్గంలో పర్యటించనివ్వరా?

(మొదటిపేజీ తరువాయి)

అరుణ కాన్వాయ్‌ను ఆపివేసి మీరు వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు నిలువరించారు. కొద్దిసేపు పోలీసులతో అరుణ, ఈటల వాగ్వాదానికి దిగారు.. సొంత నియోజకవర్గంలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేసుకో లేక.. తనను ఆపుతావా? అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఎంపీ డీకే అరుణ నిప్పులు చెరిగారు. ఈ రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని ఆరో పించారు. ఎక్కడి నుంచో వచ్చి ఇక్కడ రాజకీయం చే స్తానంటే సాగదని స్పష్టం చేశారు. నీకు అంత దమ్ము ఉంటే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేసి.. కొడంగల్‌లో పోటీ చేయి.. ఎన్నికలకు రా చూసుకుందామంటూ సీఎం రేవంత్‌కు ఎంపీ డీకే అరుణ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో కేఆర్‌ను మించిన నియంతలా రేవంత్ తయారయ్యారంటూ ఆమె మండిపడ్డారు. ఇక పోలీసుల తీరును బీజేపీ నేతలు ఖండించారు. మీకు అనుమతి లేదని చెప్పడంతో ఎంపీ అరుణ భీష్మించుకుని కారులోనే కూర్చోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**లగచర్ల బాధితులతో ములాఖత్**

సంగారెడ్డి సెంట్రల్ జైలులోని రిమాండ్ ఖైదీలుగా ఉన్న 16 మంది లగచర్ల బాధితులతో బీజేపీ ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్ ములాఖత్ అయ్యారు. సోమవారం సంగారెడ్డి సెంట్రల్ జైల్‌కు వెళ్లి వారితో మాట్లాడారు. ములాఖత్ అనంతరం మహబూ బ్‌నగర్ ఎంపీ డి.కె.అరుణ మాట్లాడుతూ లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వబోమని రైతులు ఎనిమిది నెలలుగా ఆందోళన చేస్తున్నారని, బలవంతంగా భూములు లాక్కుంటామని అధికా రులు చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారని పేర్కొన్నారు. రైతులు ప్రజాభిప్రాయ సేకరణను బహిష్కరించారని చెప్పారు. పోలీసుల వైఫల్యంతోనే లగచర్ల ఘటన జరిగిందని డీకే అరుణ ఆరోపించారు.

# ఎవరో ఒక్కరే ఉండాలి..

(మొదటిపేజీ తరువాయి)

తాజాగా కడియం శ్రీహరి చేసిన విమర్శలపై రాజయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

**వారిని విమర్శిస్తే చూస్తూ ఊరుకోం...**

బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరిపై మాజీ మంత్రి తాటికొండ రాజయ్య నిప్పులు చెరిగారు. స్థాయిని మరిచి బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శిస్తే చూస్తూ ఊరు కోమని కడియం శ్రీహరికి తాటికొండ రాజయ్య వార్నింగ్ ఇచ్చారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తాటికొండ రాజయ్య విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్, కేటీఆర్‌లపై కడియం శ్రీహరి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు.

**సవాళ్ల పర్వం..**

స్టేషన్ ఘన్‌పూర్‌లో కడియం శ్రీహరి , రాజయ్యల మధ్య సవాళ్ల పర్వం నడుస్తోంది. నిన్న కడియం శ్రీహరి చేసిన సవాల్‌ను రాజయ్య స్వీకరించారు. 'స్టేషన్ ఘన్‌పూర్‌లో నువ్వా.. నేనా ఇద్దరిలో ఒక్కరే మిగలాలి. నువ్వు దళిత ద్రోహివి..స్థానికేతరుడివి. నిన్ను స్టేషన్ ఘన్‌పూర్ నుంచి తరిమే వరకు నేను నిద్రపోను. కడియం శ్రీహరి అవినీతి చిట్టా మొత్తం బయట పెడతా. నిన్ను వదిలే ప్రసక్తే లేదు. నీ అల్లు డుని అడ్డం పెట్టుకుని స్టేషన్ ఘన్ పూర్ నియోజక వర్గంలో భూములు కబ్జా చేస్తున్నది నిజం కాదా. నీ భూ కబ్జాలు బయటపెట్టడానికి నేను సిద్ధం. నువ్వు సత్య హరిశ్చంద్రుడివి అయితే నీ బిడ్డను ఎంపీని చేయడానికి రూ.100 కోట్లు ఎలా ఖర్చు పెట్టావు. ఆ డబ్బు ఎక్కడిది'' అని కడియం శ్రీహరిపై రాజయ్య ప్రశ్నల వర్షం కురిపించారు.

**శుద్ధపూసలా మాట్లాడుతున్నావ్..**

''కడియం శ్రీహరి శుద్ధపూసలా మాట్లాడుతున్నారు. ఆయన రాజకీయ వ్యభిచారిలాగా వ్యవహరిస్తున్నా రు. టీడీపీ ఎమ్మెల్యే పదవితోపాటు డిప్యూటీ స్పీకర్ పదవికి సైతం కేసీఆర్ రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీ స్థాపించారు. పలు సందర్భాల్లో ఎమ్మెల్యే, ఎంపీ పదవులకే కాదు.. కేంద్ర మంత్రి పదవికి సైతం కేసీఆర్ రాజీనామా చేశారు. కడియం శ్రీహరి ముందు బెంచి నుంచి వెనుక బెంచిలో కూర్చునే స్థాయికి వచ్చారు. అలాంటి కడియం శ్రీహరి.. తనకు ఫిరాయింపు చట్టాలపై గౌరవం ఉందని చెప్పడం సిగ్గుచేటుగా ఉంది. 1994లో కడియం శ్రీహరికి ఎమ్మెల్యే అయ్యే నాటికి డొక్కు స్కూటర్ మాత్రమే ఉండేది. అలాంటి కడియం శ్రీహరిని ఎన్టీఆర్ పిలిచి.. ఎమ్మెల్యే చేసి మంత్రిని చేశారు. సాంఘీక సంక్షేమ శాఖా మంత్రిగా చేసి కడియం కుబేరుడు స్థాయికి చేరారు. మంత్రిగా కడియం శ్రీహరి 8 శాతం కమీషన్ తీసుకున్నారు. శ్రీహరి కుమార్తె ఎంపీ కావ్య, అల్లుడు నజీర్ హాంకాంగ్, సింగపూర్‌లో సైతం భారీగా ఆస్తులు కొనుగోలు చేశారు. కడియం శ్రీహరికి దళిత దొరగా పేరు పెట్టారు. 1999లో ఒక్కో ఓటుకు కడియం శ్రీహరి రూ. 500 ఇచ్చి నాపై గెలిచారు. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి వేరే పార్టీలో చేరితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. కాంగ్రెస్ పార్టీ అధికా రంలో ఉన్న సమయంలోనే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరాను'' అని తాటికొండ రాజయ్య గుర్తు చేశారు.

## వేములవాడ రాజన్నకు రూ. 127 కోట్లు

హైదరాబాద్, మహా: వేములవాడ రాజ రాజేశ్వర ఆలయ అభివృద్ధి పనుల కోసం తెలంగాణ ప్రభుత్వం రూ. 127.65 కోట్లను మంజూరు చేసింది. శ్రీ రాజరాజే శ్వర ఆలయ కాంప్లెక్స్ విస్తరణ, భక్తులకు అవసరమైన అధునాతన సదుపాయాలకు రూ.76 కోట్లు కేటాయించారు. ఆలయం నుండి మూలవాగు బ్రిడ్జి వరకు రోడ్ల విస్తర ణకు రూ.47.85 కోట్లు కేటాయించారు. మూలవాగులోని బతుకమ్మ తెప్ప నుండి జగిత్యాల కమాన్ జంక్షన్ వరకు డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణానికి రూ.3.8 కోట్ల నిధులను కే టాయించారు. ఈ నెల 20న సీఎం రేవంత్ రెడ్డి వేములవాడలో పర్యటించనున్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యక పూజలు చేయనున్నారు. అనంతరం వేములవాడ సభలో గల్ఫ్ బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషి యా చెక్కుల పంపిణీ చేయనున్నారు.

## రాజకీయాలకు గుడ్ బై

### ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన ప్రకటన




హైదరాబాద్, మహా: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన కామెంట్స్ చేశారు. ఇక పై చిల్లర రాజ కీయాలకు దూరంగా ఉంటానన్నారు. నియోజ కవర్గ ప్రజలకు సేవ చేసుకుంటానన్నారు. చిల్లర రాజకీయం నుంచి దూరంగా వెళ్లి ధర్మ కార్యకమా లు నిర్వహిస్తానన్నారు. భారతదేశాన్ని హిందూ రాష్ట్రం చేయాలనదే తన లక్ష్యం అన్నారు. బీజేపీ కీలక నేత లక్ష్మణ్ సమక్షంలో రాజాసింగ్ ప్రాతిని ధ్యం వహిస్తున్న గోషామహల్ కు చెందిన కీలక నేత అలా పురుషోత్తం పార్టీలో చేరడంతో రాజాసింగ్ సంచలన ప్రకటన చేశారు. రాజాసింగ్ కు చెక్ పెట్టే వ్యూహంతోనే హైకమాండ్ పురుషోత్తంను చే ర్చుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రేటర్ బీజేపి పాలిటిక్స్ హాట్ హాట్ గా మారాయి.

# శ్రీవాణి ట్రస్ట్ రద్దు

మహా, తిరుపతి: టీటీడీ పాలక మండలి పలు సంచలన నిర్ణయాలు తీసుకుంది. శ్రీవాణి ట్రస్టును రద్దు చేస్తూ ప్రకటన జారీ చేసింది. సామాన్య భక్తుల కు రెండు, మూడు గంటల్లోనే దర్శనం కల్పించేలా మార్పులు చేసేందుకు చర్యలు చేపట్టింది. కంపా ర్ట్‌మెంట్లలో భక్తులు ఇబ్బందులు పడకుండా త్వరితగ తిన స్వామివారి దర్శనం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించింది. టీటీడీలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను వీఆర్ఎస్ లేదా ప్రభుత్వ శాఖల్లోకి బదిలీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు టీటీడీ ఛైర్మన్ బి.ఆర్.నాయుడు ప్రకటన జారీ చేశారు.

**సంచలన నిర్ణయాలు**

తిరుమల డంపింగ్ యార్డులోని చెత్తను మూడు నెలల్లో క్లియర్ చేయాలని టీటీడీ నిర్ణయించింది. శ్రీని వాససేతు పేరుని గరుడ వారధిగా మార్పు చేస్తున్నట్లు ప్రకటించింది. అలిపిరిలో దేవలోక్‌కు కేటాయించిన 20 ఎకరాల భూమిని టీటీడీకి అప్పగించే విధంగా ప్రభుత్వానికి లేఖ రాయాలని బి.ఆర్. నాయుడు నిర్ణ యించారు. అలాగే తిరుమల పరిసర ప్రాంతాల్లో రా జకీయాలు మాట్లాడడంపై నిషేధం విధించారు. ఈ ని బంధనలు అతిక్రమిస్తే కేసులు పెడుతామని ఆయన హెచ్చరించారు. స్థానికులకు ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించేలా టీటీడీ సంచలన నిర్ణయం తీసుకుంది. శ్రీవాణి ట్రస్టును రద్దు చేస్తూ టికెట్ల విక్రయం ద్వారా వచ్చే సొమ్ముని టీటీడీ అకౌంట్ లోనే జమ అయ్యేలా నిర్ణయం తీసుకుంది. స్వామివారికి చెందిన నగదును ప్రైవేట్ బ్యాంకు డిపా



జిట్లు నుంచి ప్రభుత్వ బ్యాంకుల్లో జమ చేసేలా టీటీడీ పాలకమండలి నిర్ణయం తీసుకుంది.

**అన్నదానంలో మరో ఐటమ్**

అన్నదానంలో నూతనంగా మరో ఐటమ్‌ని భక్తులకు వడ్డించాలని టీటీడీ బోర్డు నిర్ణయించింది. శ్రీవారి ప్రసాదాల్లో నాణ్యమైన నెయ్యి వినియోగించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించింది. టీటీడీ ఉద్యోగులకు ఇస్తున్న బ్రహ్మోత్సవ బహుమానాన్ని రూ.14 వేల నుంచి రూ.15,400లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. వైసీపీ హయాంలో శారద పీఠానికి కేటాయించిన భూములు రద్దు చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అలాగే ఆ స్థలంలో పీఠం నిర్మించిన బిల్డింగ్‌ని కూల్చివేయాలని నిర్ణయం తీసుకుంది. టూరిజం శాఖకు కేటాయిస్తున్న 4 వేల ఎస్ఈడీ టిక్కెట్లు రద్దు చేస్తూ టీటీడీ ఛైర్మన్ బి.ఆర్. నాయుడు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు.



## సభకు వస్తే కుర్చీ ఫ్రీ!

### అన్నాడీఎంకే బంపర్ ఆఫర్

మహా, చెన్నై: తమిళనాడు విపక్షం అన్నాడీఎంకే సభకు జనాన్ని ఆకర్షించేం దుకు వినూత్నమైన ఎత్తుగడ వేసింది. సభకు వస్తే కుర్చీ ఫ్రీ అని బంపర్ ఆఫర్ ప్రకటించింది. సభకు వచ్చిన వాళ్లు, సభ ముగిశాక కుర్చీ తీసుకెళ్లిపోవచ్చని వెల్ల డించింది. తిరుపూర్ పెరుమానల్లూర్ లో అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జనసమీకరణ బాధ్య తను అన్నాడీఎంకే అధిష్ఠానం స్థానిక నేతలకు అప్పగించింది. దాంతో, వారు ఈ సమావేశాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని... "సభకు రండి, కుర్చీ పట్టుకె ళ్లండి" అంటూ ఆఫర్ అనౌన్స్ చేశారు. దాంతో ఈ సమావేశానికి జనాలు భారీగా తరలివచ్చారు. సభకు హాజరై, ఎంచక్కా కుర్చీలను ఇంటికి పట్టుకెళ్లారు.

## మేయర్ భర్తపై రాడ్డుతో దాడి




### వీడియో చిత్రీకరించి వైరల్

నిజామాబాద్, మహా : నిజామాబాద్ నగరంలో మేయర్ దండు నీతూ కిరణ్ భర్త బీఆర్ఎస్ నాయకులు దండు చంద్రశేఖర్ పై దాడి జరిగింది. ఈ సంఘటన సోమవారం సాయంత్రం నాగారం 80 క్వార్టర్స్ లో చోటు చేసుకుంది. నగరంలోని 10వ డివిజన్ లో ఓ వాటర్ ప్లాంట్ వద్ద 80 క్వార్టర్స్ కు చెందిన ఆటో డ్రైవర్ షేక్ రసూల్ ఆలియాస్ శక్రూ అనే యువకుడు శేఖర్ పై దాడి చేశాడు. అంతకు ముందు సంబంధిత దాడి వీడియోను తీసేందుకు వ్యక్తిని ముందుగానే సిద్ధం చేసుకుని దాడి చేయడం దారుణం. శేఖర్ పై ముందుగా చేతితో దాడి చేసి ఆటోలో ఉన్న రాడ్ తీసుకువచ్చి తలపై బాదాడు. ఈ ఘటనలో శేఖర్ కు తీవ్ర రక్త స్రావం. అతన్ని హుటాహుటిన ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించారు. బీఆర్ ఎస్ నాయకుడు దండు శేఖర్ పై జరిగిన దాడి గురించి నిజామాబాద్ నార్త్ సిఐ కు వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. మేయర్ భర్త శేఖర్ పై జరిగిన దాడి వీడియో సోషల్ మీడియాలో గిరికిలు కొడుతుంది. స్థానికంగా వంద గజాల ప్లాట్ వివాదంలో ఈ దాడి జరిగినట్లు తెలిసింది.

# హైడ్రా మళ్లీ దూకుడు..

## అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

### సంగారెడ్డిలోని అమీన్‌పూర్‌లో జోరుగా కూల్చివేతలు



హైదరాబాద్, మహా: ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రా సోమవారం మరిన్ని కూల్చివే తలు చేపట్టింది. హైడ్రా మళ్లీ దూకుడు పెంచింది. నగర శివారు ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా ఫోకస్ పెట్టింది. అమీన్ పూర్ వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణం పై కొరడా ఝుళిపించింది. రోడ్డును ఆక్రమించి నిర్మించిన భవనాన్ని కూల్చివేశారు. నోటీస్ ఇచ్చి నప్పటికీ ఇళ్లను తొలగించకపోవడంతో హైడ్రా సీరియస్ అయింది. భారీ యంత్రాలతో అక్రమ నిర్మాణాన్ని హైడ్రా సిబ్బంది కూల్చివేస్తున్నారు.

**వందనపురి కాలనీలో చర్యలు..**

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో హైడ్రా అధి కారులు కూల్చివేతలు చేపట్టారు. వందనపురి కాలనీలో 848 సర్వే నంబర్‌లో అక్రమ నిర్మాణం పై కొరడా ఝుళిపించారు. కొంతమంది రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారు. భారీ యం త్రాలతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు వాటిని కూల్చివేస్తున్నారు. అమీన్‌పూర్‌లోని వం దనపురి కాలనీలో అక్రమ భవనాన్ని హైడ్రా అధికా రులు కూల్చివేస్తున్నారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్త కుండా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు.

**మరో రెండు చోట్ల ఆక్రమణలు..**

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో మరో రెండు చోట్ల అక్రమ నిర్మాణాలను గుర్తించారు. ఇటీవల నాగారం మున్సిపాలిటీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఇళ్లను కూల్చివేశారు. ముందుగానే హైడ్రా అధికారులు నోటీసులు ఇచ్చి 15 రోజులు గడువు ఇస్తున్నారు. రెండు వారాల్లో నిర్మాణాల ను యజమానులే ఆక్రమణలు తొలగించకపోతే హైడ్రా రంగంలోకి దిగనుంది.

**ఇప్పటి వరకు 300కుపైగా అక్రమ నిర్మాణాల కూల్చివేత..**

తెలంగాణలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల కోసం కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న సంచలన ని ర్ణయమే హైడ్రా. దీనిని ఏర్పాటు చేసి మూడున్నర నెలలు దాటింది. ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న చాలా అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేసింది. రాష్ట్ర చరిత్రలోనే మూడున్నర నెలల వ్యవధిలో 300కు పైగా అక్రమ నిర్మాణాల హైడ్రా నేలమట్టం చేసింది. ప్రభుత్వ ఆస్తులు, చెరువుల పరిరక్షణ కోసం జూలై 19వ తేదీన హైడ్రాను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో 99ను తీసుకువచ్చింది. దీంతో జూలై 26వ తేదీ నుంచి కూల్చివేతలను మొదలుపెట్టింది హైడ్రా. ఇప్పటి వరకు 30కు పైగా ప్రాంతాల్లో 300కు మించి ఆక్రమణలను కూల్చివేసింది. 100 రోజుల్లో 120 ఎకరాలను ప్రభుత్వానికి అప్పగింది. జీ హెచ్ఎంసీతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల్లో హైడ్రా దూకుడు మామూలుగా లేదు. హీరో నాగార్జున ఎన్ కన్వెన్షన్ కూల్చివేతతో దేశ వ్యాప్తంగా హైడ్రా పేరు మార్మోగింది.

### వ్యతిరేకత రావడంతో..

అయితే.. హైడ్రా కూల్చివేతలపై ప్రజలు హడలెత్తిపోయారు. ఎప్పుడు ఎవరి ఇంటిని కూల్చివేస్తారో అని భయాందోళనలో ఉన్నారు. హైడ్రా కూల్చివేతలపై పలు చోట్ల తీవ్రమైన వ్యతిరేకత కూడా వచ్చింది. పలువురు న్యాయస్థానాలను ఆశ్రయించగా.. హైడ్రా చట్టబద్ధతపై కోర్టు కూడా ప్రశ్నించింది. జీవో 99పై స్టే ఇవ్వాలంటూ అనేక మంది హైకోర్టులో పిటిషన్‌లు వేశారు. ఈ క్రమంలో హైడ్రాకు ఎదురవుతున్న ఆటంకాలు తొలగిస్తూ ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ రూపకల్పన చేసింది. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోద ముద్ర వేశారు.

### పూర్తిస్థాయిలో బాధ్యతలు...

ఇటీవల ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రేటర్ పరిధిలోని అక్రమ కట్టడాలన్నీ కూల్చివేసే పవర్ హైడ్రాకు ఇచ్చింది. ఈ మేరకు జీవో నెంబర్ 199ను ప్రభుత్వం విడుదల చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో పలుమార్పులు చేసింది. జీహెచ్ఎంసీ చట్టంలో మున్సిపల్ శాఖలో 374అ ప్రత్యేక సెక్షన్ చేర్చింది. దీంతో బల్దియాతో పాటు 27 మున్సిపాలిటీలు, 33 గ్రామాల పరిధిలో హైడ్రా దూకుడు పెంచింది. ఇక నుంచి జీహెచ్ఎంసీ పరిధిలో ప్రభుత్వ ఆస్తులను పరిరక్షిస్తారు. అక్రమ కట్టడాలకు నోటిసుల జారీ నుంచి కూల్చివేతల వరకు అన్నీ హైడ్రా అమలు చేయనుంది.

## లగచర్లపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

### త్వరలో రాష్ట్రపతికి నివేదిస్తాం

### ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్



ఢిల్లీ, మహా: సీఎం సొంత నియోజకవర్గంలో గిరిజనులపై అఘాయిత్యాలకు పాల్పడ్డారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆరోపించారు. ఎన్నో ఏళ్లుగా ఆ భూములను ఆధారంగా చేసుకొని బతుకుతు న్నవారి జీవనాధారాన్ని గుంజుకునే యత్నం చేశారని మండిపడ్డారు. లగచర్లలో అర్ధరాత్రి సమయంలో పోలీసులు సృష్టించిన అరాచ కంపై బాధితులు ఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాలోతు కవితతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. తొమ్మిది నెలలుగా తమ భూములను ఫార్మాకి ఇవ్వబో మని లగచర్ల రైతులు చెబుతూనే ఉన్నారని సత్యవతి రాథోడ్ అన్నారు. భూములు తీసు కుంటామంటే ఆవేశంలో కొంతమంది దాడి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు సురేష్ రెడ్డి, దామోదర్ రావు, రవిచంద్ర, బీఆర్ఎస్ నేత ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ కొణతం దిలీప్ అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

ఆయన సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తు న్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో హైడ్రా రంగంలోకి దిగడంతోపాటు లగచర్ల ఘటనలపై సోషల్ మీడియాలో రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్ర వ్య తిరేక ప్రచారం జరిగింది. దీనిని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. ఆ క్రమంలో చర్యలు చేపట్టింది. ఇలాంటి పోస్టులు పెట్టిన.. పెడుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సమా యత్తమైంది. ఈ నేపథ్యంలో కొణతం దిలీప్‌ను అరెస్ట్ చేసినట్లు సమాచారం.

**ఖండించిన హరీష్ రావు**

కొణతం దిలీప్ అరెస్ట్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. అరెస్ట్‌ను ఆయన ఖండించారు. కక్షపూరిత, ప్రతీకార చర్యలు మానుకోవాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆయన హితవు పలికారు.

## లగచర్లపై ప్రధాని, రాహుల్ స్పందించాలి

(మొదటిపేజీ తరువాయి)

అర్ధరాత్రి పోలీసులు, ప్రైవేటు వ్యక్తులతో కలిసి దళిత రైతుల ఇళ్లపై దౌర్జన్యకాండ జరుగుతుందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇంత ఆందోళన జరిగితే రేవంత్ మహారాష్ట్రలో ప్రచారం చేస్తారా? అంటూ ధ్వజ మెత్తారు. రేవంత్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉంటారని.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే ఉద్దేశం మాకు లేద న్నారు. కాంగ్రెస్ ఐదేళ్లు ఉంటే మేం పదేళ్లు అధికారం లో ఉంటామన్నారు. లగచర్ల లో మాజీ ఎమ్మెల్యే అరెస్ట్ రిమాండ్ రిపోర్ట్ లో తనపేరు ఉండడంపై స్పందించా రు. అది రేవంత్ డిమాండ్ రిపోర్ట్ అన్నారు.





## హరీశ్‌రావు నా ఫోన్ ట్యాపింగ్ చేయించారు

**కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ సంచనల వ్యాఖ్యలు**

**కేసు విచారణ ముమ్మరం**

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. ఒక్కొక్కరిగా బీఆర్ఎస్ నేతల పేర్లు బయటపడుతున్నాయి. పోలీసులు ఈ కేసులో విచారణ వేగవంతం చేశారు. ఒక్కొక్కొరిగా ఫోన్ ట్యాపింగ్ బాధితులను, ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని విచారిస్తున్నారు. దీంతో బడా నాయకుల నుంచి చోటా నేతల వరకు పలురురి పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. పలువురు అధికారులు సైతం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో సోమవారం జూబ్లిహిల్స్ పోలీస్ స్టేషన్ కు విచారణకు హాజరైన సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు చక్రధర్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు అలర్ట్ మెసేజ్ వచ్చిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదుపై గతంలో రెండుసార్లు పోలీసులు విచారణ చేశారు. బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీశ్‌రావు నా ఫోన్ ట్యాప్ చేయించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం మరోసారి విచారణకు రావాలని పోలీసులు ఆదేశించడంతో జూబ్లీహిల్స్ ఏసీపీ ముందు చక్రధర్ గౌడ్ విచారణకు హాజరయ్యారు. ఆయన వద్ద ఉన్న ఆధారాలను పోలీసులు పరిశీలించి విచారణ చేశారు.

### మా ఫోన్లన్నీ ట్యాపింగ్..

**ఈ సందర్భంగా సిద్దిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు చక్రధర్ గౌడ్... మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తన ఫోన్ ట్యాపింగ్ అయిందని, తన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు ఆపిల్ కంపెనీ ద్వారా తనకు అలర్ట్ మెసేజ్ వచ్చిందని, దీనిపై గతంలో డీజీపీకి ఫిర్యాదు చేశానని తెలిపారు. గంటన్నర పాటు పోలీసులు విచారణ జరిపి.. స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారన్నారు. అప్పటి టాస్క్ ఫోర్స్ డీసీపీ రాధా కిషన్‌రావు బీఆర్ఎస్ పార్టీలో చేరి హరీష్ రావుకు సరెండర్ అవ్వాలని... లేకపోతే అక్రమ కేసులు పెడతామని బెదిరింపులకు దిగారన్నారు. తన వ్యక్తిగత ఫోన్‌తో పాటు తన భార్య, డ్రైవర్, తమ కుటుంబ సభ్యుల ఫోన్లు అన్ని ట్యాపింగ్ చేశారని పేర్కొన్నారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు తాను సమాధానం ఇచ్చానని, మేము చెప్పినట్లు వినకపోతే తన కుటుంబాన్ని అంతం చేస్తామంటూ అప్పటి డిసిపి రాధా కిషన్ రావు బెదిరింపులకు దిగారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌పై హైకోర్టులో పిటిషన్ వేసి పోరాటం చేస్తున్నానని, న్యాయం జరగకపోతే సుప్రీంకోర్టులో కూడా పిటిషన్ వేసి పోరాటం చేస్తానని చక్రధర్ గౌడ్ స్పష్టం చేశారు.**

## కల్తీ ఆహారానికి కేరాఫ్ ఖమ్మం..!

**అనుమతులు లేకుండానే ఆహార పదార్థాల తయారీ**

- లక్షా 32 వేల విలువ గల 960 కేజీల అల్లం వెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్
- రసాయనరంగులతో స్వీట్స్ తయారీ
- జిల్లాలో ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ దాడులు
- విస్తు పోయే నిజాలు వెల్లడించిన అధికారులు
- అక్రమ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి.జ్యోతిర్మయి



**కల్తీకి కాదేదీ అనర్హం అన్నట్లుగా మారింది ఖమ్మంలోని కొన్ని రెస్టారెంట్ల పరిస్థితి. తినే ఆహారాల వంటకు ఉపయోగించే ప్రతీది కల్తీచేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమారుతున్నారు కల్తీ కేటుగాళ్ళు. గొప్పగా చెప్పకునే హోటల్స్, స్వీట్ షాపుల్లో అధికారుల తనిఖీలతో బయటపడిన అసలు విషయం. అక్కడికక్కడే నోటీసులు జారీ చేసి, మిగతా వ్యాపారులకు కూడా హెచ్చరికలు జారీ చేసిన అధికారులు. పూర్తి వివరాలు మహా కథనంలో..**

**ఖమ్మం, నవంబర్ 18, మహా:** కల్తీ ఆహార పదార్థాలకు ఖమ్మం కేరాఫ్ గా నిలిచింది. గొప్పగా చెప్పుకొనే రెస్టారెంట్, హోటల్స్, స్వీట్ తయారీ కేంద్రాలు ఇలా అన్నిటిలలో అడుగడుగునా కల్తీలు జరుగుతున్నాయి. ఆరోగ్యానికి హాని కలిగించే రసాయన పదార్థాలను చాలా తేలికగా ఆహారాల తయారీలో విచ్చలవిడిగా వినియోగించడం ఖమ్మంలో పరిపాటిగా మారింది. సోమవారం రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు పలు ఆశ్చర్యకరమైన బయటకు వచ్చాయి. ఆహార తయారీ కేంద్రాల్లో తయారుచేసిన 960 కేజీల నకిలీ అల్లం పేస్టును స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా క్యాన్సర్ కు కారణమయ్యే హానికరమైన రసాయనరంగులను యథేచ్చగా స్వీట్ తయారీలో ఉపయోగించడాని అధికారులు గుర్తించారు.

తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వి. జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఫుడ్ ఇన్స్పెక్టర్స్ పి. రోహిత్ రెడ్డి, పి. స్వాతి, పి. మనోజ్ కుమార్, బి. రతన్ రావులతో కూడిన బృందం ఖమ్మం పట్టణంలో రిక్కా బజార్ లోని మ్యాజిక్ అల్లం, వెల్లుల్లి తయారీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీలు జరపగా, తనిఖీల్లో పలు ఉల్లంఘనలు బయటపడ్డాయి.

ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్ లేకుండా తయారీ, స్టోరేజ్, విక్రయ యూనిట్ చట్ట బద్ధమైన లైసెన్స్ లు లేకుండా బిజినెస్ నిర్వహిస్తున్నందునా, అల్లం వెల్లుల్లి మిశ్రమాల యొక్క బాటిల్స్ పై లేబుల్ లోపాలు బ్యాచ్ నెంబర్, ఎఫ్ఎస్ సీఐ లోగో తయారీ, రీప్యాకింగ్, చిరునామా సరైన వివరాలు లేనందున, నిర్వహణ లోపాలు నిల్వ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటం, అల్లం వెల్లుల్లి పేస్టను డిటర్జెంట్లు, ఫినాయిల్ వంటి రసాయనాల పక్కనే నిల్వ చేయడం వల్ల అల్లం వెల్లుల్లి తినే ఆహార పదార్థాలు డిటర్జెన్సీ ఫినాయిల్ వంటి కెమికల్స్ తో క్రాస్ కంటామినేషన్ జరగడం, అది నకిలీ పేస్ట్ అని అనుమానం, పేస్ట్‌లో దుర్గంధం ఉండటం, అతి తక్కువ ధరకు రిటైలర్లకు విక్రయం చేయడం, తద్వారా నాణ్యతా లోపాలు, కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ గా అనుమానించి నమూనాలు సేకరించి, రూ. లక్ష 32 వేల విలువగల 960 కేజీల అల్లం, వెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేసి, సేకరించిన నమూనాలను పరీక్ష కోసం ప్రయోగశాలకు పంపిస్తున్నామని అధికారులు తెలిపారు.

చర్చి కాంపౌండ్ లో గల విజయలక్ష్మి పిండి వంటలలో పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్న వంట గదిలో ఆహార పదార్థాలు తయారు చేయడం, కేన్సర్ కారకాలైనటువంటి రసాయన రంగులను అధిక మోతాదులలో స్వీట్లలో ఉపయోగించడం, బ్యాచ్ నెంబర్ మ్యానుఫ్యాక్చరింగ్ డేట్, లైసెన్స్ నెంబర్ లేనటువంటి 6,550 రూపాయల విలువ గల మిస్ బ్రాండెడ్ పిండి వంటలను, పచ్చళ్లను, ఇతర దుమ్ము, ధూళి అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న ఆహారాలను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేసి, పలు అనుమానిత శాంపిల్లను సేకరించి పరీక్ష నిమిత్తం తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేస్తున్నందుకు గాను వారికి నోటీసులు, ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీ చేశారు. అలాగే మయూరి బజార్ లో గల హరి స్వీట్ హోమ్ లో తనిఖీ చేయగా పూర్తిగా అపరిశుభ్ర వాతావరణంలో తయారీ నిర్వహించడం, అధిక మోతాదులో రసాయన రంగులను వాడడం, ఎక్స్ పైర్ కలర్ స్పేస్ టాపింగ్ క్రీమ్స్, మిల్క్ మిస్టర్ క్రీమ్, ఇతర పదార్థాలు సుమారు 6950 రూపాయలు ఆహార పదార్థాలను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేసి ఫుడ్ సేఫ్టీ యాక్ట్ చట్టానికి విరుద్ధంగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నందుకుగాను నోటీసులు జారీ చేశారు.

ఖమ్మం పట్టణంలోని కొందరు వ్యాపారులు తయారుచేసి, విక్రయించే ఆహార పదార్థాలలో అధిక మోతాదులో రంగులు వినియోగించడం, అనారోగ్యకరమైన పరిసరాలలో ఆహార పధార్థాలు తయారు చేయడం, ప్రమాదకరమైన రంగులను ఉపయోగించడం, గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించడం, మిస్ బ్రాండింగ్ ఐటమ్స్ ని కొంతమంది అవగాహన లేక అది తక్కువ సమయంలో అధిక లాభార్జన కోసం ఆహారాన్ని కల్తీ చేయడం వంటి చర్యలు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని అధికారులు గుర్తించారు. ఇంకా ఆహార తయారీలో కీటకాలు, దుమ్ము, బూజు వంటి నాణ్యతా లోపాలున్న ముడి పదార్థాలను ఉపయోగించడం, వంట నూనెలను పదేపదే మరిగించడం వంటి చర్యలు అల్సర్, క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధుల వ్యాప్తికి దారితీసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో, ఆహార పదార్థాలు విక్రయించే వ్యాపారులు ప్రజలకు సురక్షితమైనవి అందించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పలు నోటీసులు జారీ చేశారు. నిబంధనలు పాటించని, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యాపారాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, అవసరమైతే సీజ్ చేస్తామని రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్ వి. జ్యోతిర్మయి తేల్చిచెప్పారు. ప్రజల ఆరోగ్యం రక్షణ కోసం తెలంగాణ ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ కఠిన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని, వ్యాపారులు నిబంధనలు పాటిస్తూ బాధ్యతతో వ్యవహరించాలన్నారు.







## మహారాష్ట్రలో మాణిక్‌రావు ఠాక్రేకు మద్దతుగా కంది ఎన్నికల ప్రచారం



**ఆదిలాబాద్, మహా:** కాంగ్రెస్ అగ్ర నాయకులు మాణిక్‌రావు ఠాక్రేతో కలిసి ఆదిలాబాద్ నేత కంది శ్రీనివాస రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఠాక్రే పోటీ చేస్తున్న మహారాష్ట్రలోని దిగ్రాస్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కంది మాట్లాడుతూ మాణిక్ ఠాక్రే వంటి మంచి వ్యక్తిని, దిగ్గజ నేతను గెలిపించుకుంటే ఎంతో అభివృద్ధి జరుగుతుందని, దిగ్రస్, ధార్వ నియోజకవర్గాలు ప్రగతి పథంలో పయనిస్తాయని అన్నారు. తన ప్రసంగంతో సభికులను ఉత్తేజ పరిచారు కంది శ్రీనివాసరెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ కూటమిను గెలిపించి గద్దెనెక్కించాలని పిలుపునిచ్చారు. ఇక్కడ జరిగే ఎన్నికలు చారిత్రాత్మకమన్నారు. మాణిక్ ఠాక్రే లాంటి దిగ్గజ నేతను ఎన్నుకుంటే ఎంవీఏ కూటమి ప్రభుత్వంలో ఆయనకు కీలక పదవి దక్కే అవకాశం ఉందని, తద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు పడతాయని అన్నారు. నూతన రహదారులు, డ్రైనేజీలు, పాఠశాలల నిర్మాణాలు జరుగుతాయన్నారు. పదవిపై కాంక్షతో ఆనాడు కాంగ్రెస్‌ను మోసం చేసినవారికి తగినరీతిలో బుద్ధిచెప్పాలంటే కాంగ్రెస్‌ను గెలిపించి తీరాలని, తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు

## బీజేపీకి అద్దె మైకు కేటీఆర్

**టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి**



**హైదరాబాద్, మహా:** కేటీఆర్ బిఆర్ఎస్ అద్దెమైకులా మారారని, కాంగ్రెస్ ని బదనాం చెయ్యాలనే బీజేపీ ఇచ్చిన టాస్క్ ను పూర్తి చేయడానికి ఢిల్లీ వెళ్ళారని టిపిసిసి మీడియా మరియు క్యామినేషన్ విభాగ ఛైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి సోమవారం అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం ముగిసే ముందు ఢిల్లీలో జాతీయ మీడియాతో హడావుడి ప్రెస్ మీట్ ఎందుకో అందరికీ తెలుసని, బీజేపీ బి టీం వేషాలతో తెలంగాణను అప్రతిష్టపాలు చేసే కుట్రలు మానుకోవాలన్నారు. దళితులకు సీఎం పదవి, ప్రతి దళితగిరిజన కుటుంబానికి మూడెకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య, కామన్ స్కూలింగ్ విధానం.. రైతు రుణ మాఫీ, ఉచిత ఎరువులు, సన్న వడ్లకు బోనస్, విత్తన బాండాగారంగా తెలంగాణ, పంట కాలనీలు, అందరికీ డబుల్ బెడ్ రూం ఇండ్లు, అమరుల కుటుంబాలకు సర్కారి నౌకరి, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్లు ఇలా హామీలు తుంగలో తొక్కి ఇపుడు చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

## మహారాష్ట్రలో రైతు ఆత్మహత్యలు బీజేపీ పుణ్యమే

**ఎంవీఏ కూటమి అధికారంలోకి వస్తే.. తెలంగాణ తరహాలో గ్యారంటీల అమలు చేస్తాం.. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో మంత్రి జూపల్లి కృష్ణారావు**





**ముంబై, మహా :** దేశంలో రైతుల ఆత్మహత్యలు అత్యధికంగా మహారాష్ట్రలోనే జరుగుతున్నా మహాయుతి కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని, మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సోయాబీన్, పత్తి రైతులకు సరైన ధర కల్పించేందుకు కృషి చేస్తుందని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయిగాం నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డా. మీనల్ నిరంజన్ పాటిల్ తరపున మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లకు వివరించారు. మహా వికాస్ అఘాడీ అధికారంలోకి రాగానే తెలంగాణ తరహాలో గ్యారంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీకి ఓటేసి భారీ మెజార్టీతో మీనల్ ను గెలిపించాలని కోరారు. అదివాసీలు, దళితులు, పేదలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ కూటమి అవలంబిస్తున్న విధానాల వల్ల దేశంలో అత్యధికంగా మహారాష్ట్రలోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, నీటి కొరత, పంటలకు కనీస మద్దతు ధరలు లేకపోవడం, ఉల్లి ఎగుమతులపై నిషేధం కారణంగా ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీగా గోచికొండ



**ఇల్లందు, నవంబర్ 18, మహా:** ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీగా గోచికొండ సత్యనారాయణను ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు డా. జి. సంజీవ రెడ్డి, సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ లు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాలకు గాను 135 మందితో సెంట్రల్ కమిటీ ప్రకటించారు. ఎల్లప్పుడూ కార్మికుల హక్కుల సాధన యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా గోచికొండ సత్యనారాయణ మాట్లాడుతూ సెంట్రల్ కమిటీలో తనకు అవకాశం కల్పించినందుకు అగ్రనాయకత్వానికి, సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు యూనియన్ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని, కార్మికుల సంవత్సర పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని స్పష్టం చేశారు.

## సింగరేణిలో మిథనాల్ తయారీ ప్లాంట్

- **దేశంలోనే తొలి ప్రయోగాత్మక ప్లాంట్**
- **రోజుకు కార్బన్ డయాక్సైడ్ నుండి 180 కేజీల మిథనాల్ తయారీ**
- **కోల్ ఇండియా ప్రైవేట్ సంస్థలతో కలిసి ఏర్పాటు**
- **డిసెంబరు 31 నాటికి పూర్తి : సింగరేణి సీఎండీ బలరామ్**



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 18,** మహా: పర్యావరణ రహిత చర్యలకు పెట్టింది పేరుగా ఉన్న సింగరేణి సంస్థ మరో వినూత్న వ్యాపార విస్తరణ ఆవిష్కరణకు రంగం సిద్ధమైంది. దేశంలోనే మొట్ట మొదటిసారిగా కార్బన్ డయాక్సైడ్ వాయువు నుంచి మిథనాల్ ను ఉత్పత్తి చేసే ప్రయోగాత్మక ప్లాంటును సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం ఆధారంగా కంపెనీ ఏర్పాటు చేస్తోంది. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గును మండించగా వెలువడే వాయువు నుండి రోజుకు 500 కేజీల పరిమాణం గల కార్బన్ డయాక్సైడ్ ను సేకరించి, దీనిని హైడ్రోజన్ వాయువుతో కుదింపు చేసి, చివరిగా మిథనాల్ ద్రవాన్ని పొందే ప్రక్రియను ఈ ప్లాంట్ లో చేపట్టనున్నారు. ఈ ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం ఇప్పటికే ప్రారంభమైందని, డిసెంబర్ 31 నాటికి పూర్తవుతుందని సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్. బలరామ్ తెలియజేశారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గు మండించగా వచ్చే కర్బన ఉద్గారాలను 99.9 శాతం వరకు వాతావరణంలో కలవకుండా నివారించడం కోసం ఇఎస్పీ (ఎలక్ట్రో స్టాటిక్ ప్రెసిపిటేటర్స్) ను నెలకొల్పడం జరిగిందన్నారు. ఈ విధానంలో చివరిగా వాతావరణంలోకి అనుమతించబడిన వాయువు నుండి మాత్రమే ఈ కార్బన్ డయాక్సైడ్ వాయువును స్వీకరించడం జరుగుతుందన్నారు. థర్మల్ పవర్ ప్లాంట్ చిమ్నికి అనుబంధంగా ఈ ప్రయోగాత్మక ప్లాంట్ నిర్మాణం జరుగుతోందన్నారు.

**పూర్తయిన సివిల్ నిర్మాణాలు**

కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారు చేసే ప్లాంట్ లో ఇప్పటికే సివిల్ నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో కార్బన్ డైయాక్సైడ్ ను సంగ్రహించే యూనిట్ ను, హైడ్రోజన్ జనరేషన్ యూనిట్ ను, కంప్రెషన్ యూనిట్ ను, మిథనాల్ డిస్టిలేషన్ యూనిట్ ను ఏర్పాటు చేయనున్నారు. ఈ యంత్ర విభాగాలలో కొన్ని ఇప్పటికే నిర్మాణ ప్రాంతానికి చేరుకోగా మరికొన్ని ఈ నెలాఖరుకు చేరుకోనున్నాయి.

**మిథనాల్ తో బహువిధ వ్యాపార ప్రయోజనాలు**

ఈ ప్రయోగాత్మక ప్లాంటు ప్రారంభమైన తర్వాత రోజుకు 180 కేజీల మిథనాల్ తయారు జరగనుంది. ప్రస్తుతం దీనిని ఎవరికీ విక్రయించబోవడంలేదు. ప్రయోగం విజయవంతం అయితే పెద్ద ఎత్తున మిథనాల్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సింగరేణి సంసిద్ధంగా ఉంది. మిథనాల్ ను ఎరువుల తయారీలో, అక్రిలిక్ ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్ వస్త్రాల తయారీలో, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో కూడా విస్తృతంగా వినియోగిస్తారు. కనుక వ్యాపార విస్తరణ చర్యలో భాగంగా పెద్ద ఎత్తున మిథనాల్ ప్లాంట్ ఏర్పాటు చేసి, ఈ మిథనాల్ ను వివిధ పరిశ్రమలకు సింగరేణి సంస్థ అమ్ముకునే అవకాశం ఉంది.

### సింగరేణి సౌజన్యంతో, నిర్మాణ సారథ్యంలో..

**సింగరేణి సౌజన్యంతో, నిర్మాణ సారథ్యంలో కోల్ ఇండియా అనుబంధ రీసెర్చ్ యూనిట్ అయిన సీఎం పిడిఐఎల్ వారి ఆర్థిక సహకారంతో, ఈ ప్లాంట్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణ బాధ్యత మరియు ప్లాంట్ నిర్వహణను బెంగళూరుకు చెందిన జవహర్లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్డ్ సైంటిఫిక్ రీసెర్చ్ మరియు బ్రెత్ అప్లైడ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి అప్పగించారు. ఈ ప్లాంట్ నిర్మాణానికి సుమారు 20 కోట్ల రూపాయల ఖర్చు కానుంది.**

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | మంగళవారం, హైదరాబాద్ | 19-11-2024
CNN తెలుగు



# నేరెళ్ల, లగచర్ల ఘటనలు ఒక విశ్లేషణ!

''పోలీసు లాకప్ లో మమ్మల్ని నగ్నంగా బంధించారు. కిటికీకి చేతులు కట్టివేసి,మా కాళ్ళపై కూడా బరువు పెట్టారు. రబ్బరు లాఠీలతో మమ్మల్ని కొట్టేవారు. ఒక్క లాఠీ దెబ్బ తగిలితేనే మేము స్పృహ కోల్పోయే వాండ్లం.మా కాళ్ళు,చేతులు చచ్చుబడి పోయినట్టుగా అనిపించేది. మా కాళ్ళను చాచి,మా పాదాలను పైకప్పు నుండి గొలుసుకు వేలాడదీసి, మాపై నీళ్లు చల్లుతూ మళ్ళీ మళ్ళీ చితకబాదేవారు. మా పాదాలను చెక్క పలకపై లాక్ చేసి,మా చేతులను వెనుకకు కట్టి దారుణంగా కొడుతుండే వాళ్ళు. మా తొడలపై నిలబడి నిరంతరం కొట్టేవాండ్లు. ప్రాణముందో, లేదో తెలియని స్థితిలో మేము కేకలు కూడా వేయలేకపోయేవాళ్ళం.మేము విపరీతమైన నొప్పిని, అత్యంత బాధను అనుభవించాం'' అని నేరెళ్ల దళితులు పోలీసులు పెట్టిన చిత్రహింసలను భయాందోళనలతో ఆంగ్ల మీడియా ప్రతినిధులకు చెప్పారు. 'శక్తివంతమైన వ్యక్తులను ప్రశ్నించడానికి మీకు ఎంత ధైర్యం' అని పోలీసులు తమను కులం పేరుతో తిట్టారని దళితులు చెప్పారు.

తనను తాను ఆధునిక రాజకీయ నాయకునిగా చెప్పుకునే కేటీఆర్ మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన ప్రాంతంలో 2017 జూలైలో 'దళితులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించిన' ఘటన అది. జాతీయ స్థాయిలో ఆ ఘటన తీవ్ర ప్రకంపనలు సృష్టించింది. నేరెళ్ల దళితులు చేసిన నేరమేమిటంటే చట్టవిరుద్ధంగా వందలాది లారీలలో ఇసుక రవాణ జరగడాన్ని ,ఆ లారీల కింద పడి అమాయక గ్రామీణ ప్రాంత ప్రజలు 'రోడ్డు ప్రమాదం' లో బలి కావడాన్ని ప్రశ్నించడమే! "కాంగ్రెస్,బిజెపి సహాయం లేకపోతే తాము ఈపాటికి చనిపోయి ఉండేవాళ్లం''! అని కూడా బాధిత దళితులు వాపోయిన ఉదంతం టీవీ న్యూస్ ఛానళ్లలో అప్పట్లో ప్రసారమైంది. కేసీఆర్ అధికారంలో ఉన్నంత కాలం, 'ప్రత్యేక రాష్ట్రంలో ప్రత్యేక సామాజికవర్గం'గా 'కొంతమంది వ్యక్తులు',శక్తులు పొందిన గౌరవ మర్యాదలు,చేసిన లూటీ గురించి మాట్లాడవలసిన అవసరం ప్రత్యేకంగా లేదు.

''ఈ ఘటన అనుకోకుండా జరిగింది.దళితులపై దాడి చేయాల్సిందిగా మా ప్రభుత్వం ఎందుకు ఆదేశిస్తుంది? 10 లారీలను తగులబెట్టి,గూండాగిరీ చేస్తామంటే ఊరుకుంటామా? ఇది శాంతి భద్రతల సమస్య. ఖచ్చితంగా అణచివేస్తాం. దళితులని వాళ్ళ ముఖాలపై రాసి ఉందా?'' అని నాటి సీఎం.కేసీఆర్ మీడియా సమావేశంలో పోలీసు చర్యను గట్టిగా సమర్థించుకున్నారు. ఇప్పుడిక 'లగచర్ల' దగ్గరకు వద్దాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ ప్రాంతంలో ఫార్మాసిటీ కోసం లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు పూనుకున్నప్పుడు జరిగిన హింసాత్మక ఘటనలు ఆయనను రాజకీయంగా దెబ్బ తీయడానికి జరిగినవి.కేసీఆర్ హయాంలో పదేండ్లలో పలు ప్రాజెక్టులు,సంస్థల కోసం వేలాది ఎకరాలు సేకరణ జరిగినా,ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకపోవడం రాజకీయంగా 'మేనేజ్ మెంటు' వైఫల్యమే. ఇలాంటి ఘటనలను ముందుగానే పసిగట్టి,అవి తలెత్తకుండా రేవంత్ రెడ్డి పక్షాన ఒక 'బృందం' లగచర్ల తదితర గ్రామాలకు వెళ్లి 'మేనేజ్' చేసి ఉండవలసింది. అలా జరిగితే ప్రతిపక్షాలకు ఒక 'అస్త్రం' దొరకకుండా ఉండేది. ఈ ఘటన 'రాజకీయ ప్రేరేపిత'మైనదని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. కానీ నేరెళ్ల ఘటనలో రాజకీయాలు లేవు. మావోయిస్టులు ఆ ఘటనలో లేరు.కేవలం నాటి అధికారపార్టీ నాయకుల అక్రమాలను ప్రశ్నించిన పాపానికి 8 మంది దళితులను ఎంత క్రూరంగా హింసించారో మాటల్లో చెప్పలేం. కానీ ఇదివరకెన్నడూ చరిత్రలో జరగని సంఘటన లాగా బిఆర్ఎస్ ' మాధ్యమాలు,లగచర్ల ఘటనను ముడిసరుకుగా మార్చుకున్నవి.'పౌరహక్కుల ఉద్యమ కార్యకర్తలు ఏమయ్యారు?కోదండరాం ఎటు పోయారు? ప్రజా సంఘాల నోరు ఎందుకు మూతపడింది'?. అంటూ ఆ మాధ్యమాలు ఘోషిస్తున్నవి. తెగ బాధపడుతున్నవి. పౌరహక్కులు,ప్రజాస్వామిక హక్కుల గురించి కేసీఆర్ పార్టీ కానీ,కేటీఆర్ నీడలో చెలరేగిపోతున్న సోషల్ మీడియా గానీ మాట్లాడడం వింతగా,ఎందుకో ఎబ్బెట్టుగా కనిపిస్తుంది. ఇందిరాపార్కు ధర్నా చౌక్ ఎత్తివేసి,కోదండరాం లాంటి వారి ఇండ్లపై దాడులు చేసి,తలుపులు బద్దలుగొట్టి అరెస్టు చేసిన ఉదంతాలన్నింటినీ ఉద్దేశపూర్వకంగానే కేసీఆర్ పార్టీ నాయకులు మరచిపోయారేమో!

కేసీఆర్ అధికారం కోల్పోతే తప్ప ప్రజాసంఘాలు, పౌరహక్కుల ఉద్యమాలు గుర్తుకు రావడం లేదు. 'లగచర్ల' వంటి ఒకటీ,రెండు ఘటనలను భూతద్దంలో చూపి రాష్ట్రంలో శాంతిభద్రతలలో ముఖ్యమంత్రి విఫలమయ్యారని బిఆర్ఎస్ మీడియా' ఉధృతంగా ప్రచారం చేస్తున్నది.రేవంత్ రెడ్డి ఒక 'విజన్' తో వెడుతున్నారు.అది బిఆర్ఎస్ కు,ఆ పార్టీ ప్రాయోజిత మీడియాకు కంటగింపుగా ఉన్నది.అందువల్ల ఎక్కడయినా ప్రజల్లో కొంత అసంతృప్తి,లేదా ఆగ్రహం వ్యక్తమయితే దాన్ని గోరంతలు కొండంతలు చేసి రేవంత్ ను అప్రదిష్ట పాలు జేసే పథకాన్ని బిఆర్ఎస్ సమర్ధంగా అమలు చేస్తున్నది. ఇందులో భాగంగానే జాతీయ స్థాయిలో తెలంగాణ సిఎం.రేవంత్ ఇమేజ్ ను దెబ్బ కొట్టడానికి బీఆరెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.కేటిఆర్ డిల్లీలో 'లగచర్ల' ఘటనపై ' షో ' నిర్వహించారు. లగచర్ల నుంచి లంబాడీలను డిల్లీకి తీసుకువెళ్లి, జాతీయ ఎస్.టీ.కమిషన్ ముందు 'పరేడ్' చేయించారు. కాగా లగచర్ల ఘటనపై సీఎం. రేవంత్ రెడ్డి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదుశాంతి భద్రతలకు భంగం కలిగించినందున అణచివేస్తామనీ అనలేదు. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ స్థాయి అధికారిని అవసరమైతే 'భౌతికంగా నిర్మూలించాల'ని అక్కడి ఘటనలు ,దృశ్యాలు కనిపించినా ముఖ్యమంత్రి సంయమనంతో ఉన్నారు.

> రేవంత్ రెడ్డి ఒక 'విజన్' తో వెడుతున్నారు.అది బిఆర్ఎస్ కు,ఆ పార్టీ ప్రాయోజిత మీడియాకు కంటగింపుగా ఉన్నది.అందువల్ల ఎక్కడయినా ప్రజల్లో కొంత అసంతృప్తి,లేదా ఆగ్రహం వ్యక్తమయితే దాన్ని గోరంతలు కొండంతలు చేసి రేవంత్ ను అప్రదిష్ట పాలు జేసే పథకాన్ని బిఆర్ఎస్ సమర్ధంగా అమలు చేస్తున్నది.ఇందులో భాగంగానే జాతీయ స్థాయిలో తెలంగాణ సిఎం.రేవంత్ ఇమేజ్ ను దెబ్బ కొట్టడానికి బీఆరెస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.కేటిఆర్ డిల్లీలో 'లగచర్ల' ఘటనపై ' షో ' నిర్వహించారు.

పోలీసు వర్గాలు చట్టప్రకారం నడుచుకుంటున్నవి. ఇదిలా ఉండగా సోషల్ మీడియాపై కోట్లాదిరూపాయలు ఖర్చు పెట్టగలుగుతూ,తామే అధికారంలో ఉన్నట్టుగా బీఆర్ ఎస్ ఒక 'ఇంప్రెషన్' ప్రజలకు ఇవ్వడానికి కారణం,ధైర్యం వాళ్ళ 'ధన బలమే'! ఆ బలం పుష్కలంగా ఉన్న కారణంగా నిజాలను పాతర వేయవచ్చునని,అబద్ధాలను విరివిగా మార్కెట్లోకి వదలవచ్చునని ప్రధాన ప్రతిపక్షం భావిస్తున్నది. నిజానికి ఇలాంటి ట్రెండ్ ఇదివరకు లేదు. 'అధికార లేమి'తో కొట్టుమిట్టాడుతూ తక్షణం మళ్ళీ అధికారంలోకి రావాలన్న కాంక్షతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'కదన కుతూహలం'తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విరుచుకుపడుతున్నారు. సీఎంతో 'ప్రత్యక్ష యుద్ధాని'కి సిద్ధమైనట్టుగానే ప్రకటనలు చేస్తున్నారు. తెలంగాణ రాజకీయాల్లో రెండు అంశాల చుట్టూ చర్చ కేంద్రీకృతమైంది.

ఇందులో ఒకటి: రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత. రెండవది:అతి కొద్ది కాలంలోనే ప్రధాన ప్రతిపక్షం పుంజుకోవడం.ఈ రెండు అంశాలు వేర్వేరు కాదు.ఒకదానికొకటి ముడిపడి ఉన్నవి.ప్రభుత్వంపై వ్యతిరేక గాలి నెమ్మదిగా మొదలయి క్రమంగా పెరగడం.ఈ 'వ్యతిరేక గాలి'ని ఆయుధంగా మలచుకొని ప్రతిపక్షం తన అస్త్ర,శస్త్రాలను దుమ్ముదులిపి బయటకు తీయడం.ముందుగా ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి గురించి చర్చించాలి. పరిపాలన వేరు. రాజకీయాలు వేరు.రాజకీయ నాయకత్వ ప్రతిభ రేవంత్ లో పుష్కలంగా ఉన్నది. అయితే అదొక్కటే ముఖ్యమంత్రిగా రాణించడానికి,పాలనా పరంగా మెరుపులు మెరిపించడానికి సరిపోకపోవచ్చు. సంక్షేమ కార్యక్రమాలు కేసీఆర్ హయాంలో స్వైర విహారం చేశాయి. వాటి లోటుపాట్లు,ఇతర నెగెటివ్ పాయింట్లు ఎలా ఉన్నా జనంలో 'కేసీఆర్ ఫోటో' నమోదయిపోయింది. అదంతా ఒక్క రాత్రిలో జరగలేదు.2001 నుంచి 2014 వరకు నడిపిన ఉద్యమ అనుభవాలు కేసీఆర్ పరిపాలనకు అదనపు బలంగా పనికివచ్చాయి.ప్రొఫెసర్ జయశంకర్,ఆర్.విద్యాసాగరరావు,గాదె ఇన్నయ్య,వి.ప్రకాష్ వంటి వారందరూ వ్యవసాయం, ఇరిగేషన్,విద్యుత్తు తదితర పలు రంగాలపై కేసీఆర్ 'శిక్షణ' పొందారు. ఆ అధ్యయనాన్ని 2014 లో ముఖ్యమంత్రి అయిన తర్వాత అమలులో పెట్టారు. ప్రజలకు' ఇన్ స్టంట్ ఫలితాలు 'కావాలి. కళ్ళ ముందు వాళ్ళకు డబ్బు కనిపించాలి.

'రైతు బంధు' సహా అనేక సంక్షేమ కార్యక్రమాలతో జనంపై ప్రయోగాలు చేశారు.ఈ పథకాలన్నింటికీ తెలంగాణను ఆయన ప్రయోగశాలగా మార్చేశారు. పక్కా ప్రణాళిక ప్రకారం ఓటు బ్యాంకులను తయారుచేసుకోవడం,వాటిని సుస్థిరం చేసుకోవడంపై కేసీఆర్ తొమ్మిదిన్నర ఏండ్ల పాటు పూర్తిగా దృష్టిని కేంద్రీకరించారు.ఆయన రైతుబంధు,వృద్ధాప్య పెన్షన్ లు తనను శాశ్వతంగా సీఎంగా ఉండేలా చేస్తాయని నమ్మారు.కానీ 2023 డిసెంబర్ లో అసెంబ్లీ ఎన్నికల్లో ఆయా లబ్ధిదారులు అనూహ్యంగా కేసీఆర్ కు వ్యతిరేకంగా ఓటు వేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ ఏర్పాటు చేస్తున్నది. హైదరాబాద్,సికింద్రాబాద్,సైబరాబాద్ వంటి మూడు సిటీలు ఉండగా,ఫోర్త్ సిటీగా ఫ్యూచర్ సిటీని నిర్మించతలపెట్టారు.

రంగారెడ్డి జిల్లా ముచ్చింతల్ ప్రాంతాల్లో ఈ ఫోర్త్‌సిటీ ఏర్పాటవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం వద్ద 14 వేల ఎకరాల భూమి ఉండగా,మరో 16 వేల సేకరించనున్నారు. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూ సేకరణ జరపనున్నారు.మొత్తం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మితమవుతుంది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోను విస్తరించాలని సీఎం ఆలోచన.ఈ మేరకు ఎలైన్‌మైంట్ ఖరారు చేసే పనిలో సర్కార్ నిమగ్నమైంది.ఫ్యూచర్ సిటీ అభివృద్ధి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా గ్రీన్ ఫీల్డ్ రహదారిని నిర్మించనున్నారు. ఫ్యూచర్ సిటీలో 'స్కిల్ యూనివర్సిటీ'తో పాటు 'స్పోర్ట్స్ కాంప్లెక్స్', అంతర్జాతీయ ప్రఖ్యాత సంస్థలు,పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టనున్నవి. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి శ్రీశైలం నేషనల్ హైవే వరకు 40 కి.మీ పొడవునా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును నిర్మించనున్నారు.రీజినల్ రింగుబంధించారు.రెయిలింగ్‌లతో రోడ్డును దీన్నికనెక్టు కనెక్ట్ చేయనున్నారు.

''ముందుగా జరిగేది ఎప్పుడు కూడా తరువాత జరిగే దానికన్నా మెరుగ్గా,మౌలికమైనట్టుగా కనిపిస్తుంది.ఇదివరకటి పాలకుడు ప్రసిద్ధుడు,గొప్ప పేరు ఉన్న వ్యక్తి అయితే అతన్ని ప్రజలు మరచిపోయేలా చెయ్యాలి.అతని కన్నా ఎక్కువ పేరు మీకు రావాలంటే మీరు రెండింతలు విజయం సాధించాలి.గత పాలకుల నీడలు,జాడలను నామరూపాల్లేకుండా చేయాలి.మీరు వేరే మార్గాన్ని,ఇంకా చెప్పాలంటే ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంపిక చేసుకొని ముందుకు వెళ్ళాలి.ఆ దారిలో మునుపెవరూ నడిచి ఉండకపోవచ్చు.అయినా మీరు అలాంటి దారిలోనే వెళ్ళాలి.మీకంటూ ఒక గుర్తింపు,పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలి'' అని 16011658 కాలానికి చెందిన తత్వవేత్త బాలస్తర్ గ్రేషియన్ అన్నాడు.

> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ ప్రాంతంలో ఫార్మాసిటీ కోసం లగచర్లలో ప్రజాభిప్రాయసేకరణకు పూనుకున్నప్పుడు జరిగిన హింసాత్మక ఘటనలు ఆయనను రాజకీయంగా దెబ్బ తీయడానికి జరిగినవి. కేసీఆర్ హయాంలో పదేండ్లలో పలు ప్రాజెక్టులు,సంస్థల కోసం వేలాది ఎకరాలు సేకరణ జరిగినా,ఇటువంటి ఘటనలు చోటు చేసుకోకపోవడం రాజకీయంగా 'మేనేజ్ మెంటు' వైఫల్యమే.ఇలాంటి ఘటనలను ముందుగానే పసిగట్టి,అవి తలెత్తకుండా రేవంత్ రెడ్డి పక్షాన ఒక 'బృందం' లగచర్ల తదితర గ్రామాలకు వెళ్లి 'మేనేజ్' చేసి ఉండవలసింది.అలా జరిగితే ప్రతిపక్షాలకు ఒక 'అస్త్రం' దొరకకుండా ఉండేది. ఈ ఘటన 'రాజకీయ ప్రేరేపిత'మైనదని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది.

రేవంత్ రెడ్డి కూడా గ్రేషియన్ ఫార్ములాను పాటించవలసి ఉన్నది. గత ముప్పయి ఏళ్లలో హైదరాబాద్ నగరం వేగంగా అభివృద్ధి చెందుతున్నది.ఇదేమీ కేసీఆర్ మహత్యం కాదు.ఇంద్రజాలమూ కాదు. ముఖ్యమంత్రులుగా చంద్రబాబు,వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేసిన కృషిని కేసీఆర్ కొనసాగించారు. రాజకీయాలకు అతీతంగానే గత ప్రభుత్వాల నిర్ణయాలను ముందుకు తీసుకెళ్లడానికి సీఎం.రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారు.రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.రింగ్ రోడ్డు చుట్టూ రైలు సదుపాయం కూడా కల్పించబోతున్నారు.హైదరాబాద్ లోనే అభివృద్ధి కేంద్రీకృతం కాకుండా రాష్ట్రం మొత్తం అభివృద్ధి చెందేలా రేవంత్ దగ్గర ఒక ప్రణాళిక ఉన్నది దాన్ని '2050 మెగా మాస్టర్ ప్లాన్ ' గా రేవంత్ రెడ్డి నిర్వచించారు.



- ఎస్.కే.జకీర్,
సీనియర్ జర్నలిస్ట్.



# ఇండియా అంటే ఇందిరా.. ఇందిరా అంటే ఇండియా

## నాడు దేశవ్యాప్తంగా మార్మోగిన ఒకే ఒక పేరు
## పట్టు వదలకుండా విజయల బాట
## నేడు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి

> 'ఇండియా అంటే ఇందిరా.. ఇందిరా అంటే ఇండియా' అనే మాట దేశవ్యాప్తంగా నాడు మార్మోగింది. 'ఇందిరా మాటలు తూటల్లా ఉంటాయి.. ఆమె నిర్ణయాలు వ్యూహాత్మకంగా ఉంటాయి.. ఇందిరా ఒక పవర్ ఫుల్ లేడీ' ఈ మాటలు అప్పుడు బాగా వినిపించేవి. నాటిరోజుల్లో ఆమె పేరు విరివిగా వినిపించేది. అప్పుడే కాదు.. ఇప్పుడు కూడా పలువురు నేతలు, ప్రజలు గుర్తుచేస్తూనే ఉంటారు. నేడు భారతదేశ మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ 107వ జయంతి సందర్భంగా మహా ప్రత్యేక కథనం.

నవంబర్ 19, 1917లో భారత మొట్టమొదటి ప్రధాని జవహర్ నెహ్రూ కమలా నెహ్రూ దంపతులకు ఇందిరా గాంధీ జన్మించారు. భారతదేశ మొదటి మహిళా ప్రధానమంత్రిగా పనిచేసిన ఇందిరా గాంధీ తన పాలనలో తనదైన ముద్ర వేశారు. నాలుగుసార్లు ప్రధానిగా పనిచేసిన ఆమె ఎన్నో సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. అందులో ముఖ్యంగా బ్యాంకులను జాతీయం చేయడం. 1966లో ఆమె ఇండియాకు ప్రధానమంత్రి అయ్యారు. అయితే, అప్పటికే భారతదేశం చాలా కష్టాల్లో ఉంది. నిరుద్యోగ సమస్య, ద్రవ్యోల్బణంతో పాటు చాలా సమస్యలు ఇండియాలో తాండవమాడుతున్నాయి. ఇందిరా ప్రధాని అయిన తరువాత వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వచ్చారు. ఇవే కాదు.. 1971లో పాకిస్థాన్ తో జరిగిన యుద్ధంలోనూ భారత్ ఘన విజయం సాధించింది. ఫలితంగా బంగ్లాదేశ్ అనే కొత్త దేశం ఏర్పడింది. ఈ విషయంలో ఇందిరాది కీలక పాత్ర. ఆమె పట్టు వదలకుండా పాకిస్థాన్ పై విజయం సాధించారని చెబుతుంటారు. అందుకే.. అప్పటి ప్రతిపక్ష నేత వాజ్ పేయి.. ఇందిరా గాంధీని కనకదుర్గ అని సంబోధించేవారంటా. అయితే, ఎమర్జెన్సీ తరువాత కాంగ్రెస్ పార్టీ భారీ ఓటమిని చవి చూడాల్సి వచ్చింది. ఆ సమయంలో ఇందిరా గాంధీ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఆ తరువాత మళ్లీ ఎలక్షన్స్ వచ్చాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచేలా ప్రణాళికలు రచించి, అనుకున్నట్లే విజయం సాధించారు. ఆ తరువాత తన దైన పాత్రను మార్క్ ను చూపిస్తూ వచ్చారు. ప్రజలకు చేరువయ్యేలా పథకాలు అమలు చేశారు. అందుకే ఆమె పేరు దేశవ్యాప్తంగా ప్రతి ఒక్కరి నోళ్లలో ఆడేది.

ఇంగ్లీష్ తోపాటు పలు భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఇందిరా గాంధీ.. రాజకీయాలే కాదు రచనల్లోనూ ఆమె తన ప్రత్యేకతను చూపేవారు. పలు పుస్తకాలను ఇందిరా గాంధీ రచించారు. వాటికి మంచి గుర్తింపు వచ్చింది. ఎన్నో విజయాలను అందుకున్న ఇందిరా గాంధీ భారత రత్న పురస్కారాన్ని స్వీకరించారు. పలు విదేశీ అత్యున్నత పరుస్కారాలను కూడా ఆమె అందుకున్నారు. ఇందిరా గాంధీ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఇటు రాష్ట్రాల్లో కూడా ఆమె పేరు మీద పలు ప్రత్యేక పథకాలు కొనసాగుతున్నాయి.

### తెలంగాణతోనూ ప్రత్యేక అనుబంధం

ఇందిరా గాంధీకి తెలంగాణతో ప్రత్యేక అనుబంధం ఉంది. 1980 ఎన్నికల్లో యూపీలోని రాయ్ బరేలీ, తెలంగాణలోని మెదక్ నుంచి ఇందిరా గాంధీ పోటీ చేసి విజయం సాధించారు. రెండు స్థానాల్లోనూ గెలవడంతో రాయ్ బరేలీ స్థానాన్ని వదులుకుని, మెదక్ ఎంపీగా కొనసాగారు.

## రచనలకు ఆహ్వానం

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
editor@mahaadaily.com | whatsapp- 7436939999

# జర్నలిస్టులకు ఈనెల 20 నుంచి హౌసింగ్ సొసైటీ సభ్యత్వం



**ఖమ్మం, నవంబర్ 18 , మహా :** ఇండ్ల స్థలాల కోసం దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న జర్నలిస్టులకు హౌసింగ్ సొసైటీ సభ్యత్వం ఇవ్వనున్నట్లు స్తంభాద్రి జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులు కనకం సైదులు తెలిపారు. స్తంభాద్రి జర్నలిస్ట్ మ్యూచువల్లీ ఎయిడెడ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ సర్వసభ్య సమావేశం సోమవారం జిల్లా పరిషత్ గెస్ట్ హౌస్ లో సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కనకం సైదులు మాట్లాడుతూ... జర్నలిస్టులకు హౌసింగ్ సొసైటీ సభ్యత్వంను ఈ నెల 20 నుండి సీనియార్టీ ప్రాధాన్యత క్రమంలో ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఖమ్మం జర్నలిస్ట్ సోదరులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఇంటిస్థలం కల నెరవేర్చేందుకు స్తంభాద్రి జర్నలిస్టు సొసైటీ మరో అడుగు ముందుకు వేసిందన్నారు. గత కొంత కాలంగా సొసైటీలో ఖాళీగా ఉన్న పదవులను ఈ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు.

### నూతన కమిటీ :

సొసైటీ కార్యదర్శిగా బొల్లం శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మైసా పాపారావు, కోశాధికారిగా వెన్నబోయిన సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో సొసైటీ పూర్తిస్థాయి కార్యవర్గం కొలువు తీరిందన్నారు. ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తులను సీనియారిటీ ప్రాధాన్యత కలిగిన వర్కింగ్ జర్నలిస్టులకు సముచిత స్థానం కల్పిస్తూ తక్షణం స్క్రూటినీ ప్రక్రియను చేపట్టాలని సొసైటీ తీర్మానించిందన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన సొసైటీ సభ్యులకు అధికారుల ఆమోదముద్ర లభించిన వెంటనే ప్రభుత్వం నుంచి భూమి స్వాధీనంతోపాటు అవసరమైన డబ్బు జమా ప్రక్రియను అతిత్వరలోనే చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశానికి సొసైటీ డైరెక్టర్లు ఏనుగు వెంకటేశ్వరరావు, సయ్యద్ ఖదీర్, బొల్లం శ్రీనివాస్, మైసా పాపారావు, వెన్నబోయిన సాంబశివరావు, ఆలస్యం అప్పారావు, పీవీ సత్యనారాయణ, బత్తుల వాసు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాప్రతినిధులారా.. జర పట్టించుకోండి

- ఇంకెన్నాళ్లు.. ఈ అగచాట్లు
- అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టండి
- రైల్వే ట్రాక్ దాటడానికి ప్రజల అవస్థలు

**అయ్యా ప్రజాప్రతినిధులారా... జర మమ్మల్ని పట్టించుకోండి.మా మొర ఆలకించి అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి మా అవస్థలను పోగొట్టండి అంటూ...బోనకల్ మండల ప్రజలు వేడుకుంటున్నారు. వైరా, జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న రైల్వే వంతెన నిర్మాణంతో బోనకల్ మండలం రెండుగా చీలిపోవాల్సివచ్చింది.రైల్వే గేటుకు ఉత్తరాన ఉన్న 18 గ్రామాల ప్రజల రవాణా స్తంభించి నానా అవస్థలు పడాల్సివస్తోంది.మండల కేంద్రానికి రావాలంటే అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.**



**బోనకల్, నవంబర్ 18, మహా :** బోనకల్ మండల కేంద్రంలో 2014 లో వైరా, జగ్గయ్యపేట ప్రధాన రహదారిపై రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనుల వలన మండల కేంద్రం రెండు ముక్కలుగా చీలిపోయింది. రైల్వే గేట్ కు ఉత్తరం వైపు ఉన్న 18 గ్రామాల ప్రజలు మండల కేంద్రంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఐకేపీ కార్యాలయం వివిధ బ్యాంకులు కు వెళ్లాలంటే రైల్వే గేట్ దాటి వెళ్లవలసి వస్తుంది. ఇటీవల 3వ రైల్వే లైన్ నిర్మాణం చేపట్టుతున్న నేపథ్యంలో రైల్వే శాఖ వారు రైల్వే ట్రాక్ ఇరువైపులా రాకపోకలు కొనసాగకుండా ఇనుప జాలిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ జాలి నిర్మాణం పూర్తయితే రైల్వే ట్రాక్ పై అటు నుండి ఇటుగా, ఇటు నుండి ఇటుగా రాకపోకలు పూర్తిగా నిషేధించబడతాయి. అలా జరిగితే పాదచారులు కూడా రెండు కిలోమీటర్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి మీద నుండి నడిచి వెళ్లవలసి వస్తుంది. మండల కేంద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే పాదచారులకు, వాహనదారులకు ప్రయాణ సులభతరంగా ఉంటుందని, రైల్వే ఓవర్ బ్రిడ్జికి మెట్ల నిర్మాణం జరిగిన కానీ మహిళలు, వృద్ధులు మెట్లు ఎక్కటానికి ఇబ్బందులు పడతారని, మెట్ల నిర్మాణం వలన ఉపయోగం అంతంత మాత్రమే అని పలువురు అభిప్రాయపడుతున్నారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కొరకు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామరెడ్డికి, రైల్వే జీఎంకు పలుమార్లు మండలవాసులు, స్థానికులు వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అండర్ బ్రిడ్జి నిర్మాణం పై దృష్టి పెట్టి త్వరగతిన అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకొని తమ కష్టాలు తీర్చాలని వారు కోరుతున్నారు.

### అండర్ బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టాలి : మందూరి వెంకటేశ్వరరావు



గత 30 సంవత్సరాలుగా స్థానికంగా నివసిస్తున్నాం. రైల్వే వారు బ్రిడ్జి నిర్మాణం చేపట్టడంతో స్టేషన్ రావినూతల వాసులు అటువైపు ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, వైద్య నిమిత్తం హాస్పటల్ కు వెళ్లాలంటే బ్రిడ్జిపై రెండు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. ప్రస్తుతం మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడంతో రైల్వే గేట్ పై దాటేందుకు పాదచారులకు అనుమతి నిషేధించడంతో మాకు సమస్య జటిలంగా మారింది. తక్షణమే అధికారులు చొరవ చూపి అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.







# పాలకుర్తి ఎమ్మెల్యేను కలిసిన కాంగ్రెస్ నేతలు



**దేవరుప్పుల, నవంబర్ 18, మహా :** వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవానికి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని దేవరుప్పుల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరాములు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, కొడకండ్ల మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేష్ నాయక్ లు ఆహ్వాన పత్రికను అందజేశారు. నల్ల శ్రీరాములు సతీమణి అయిన నల్ల అండాలు కొడకండ్ల మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన సందర్భంగా కొడకండ్ల మండలంలో బుధవారం (20వ తేదీ) ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహిస్తుండడంతో ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొననున్నారు.


# రూ.2.48కోట్ల గంజాయి కాల్చివేత



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 18, మహా:** జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, మణుగూర్, ఇల్లెందు, అశ్వరావుపేట ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లలో పట్టుబడిన 993 కేజీల గంజాయిని సోమవారం కాల్చి వేశారు. ఖమ్మం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్థన్ అదేశాల మేరకు 54 కేసుల్లో పట్టుబడిన గంజాయిని దహనం చేశారు. ఆ గంజాయి విలువ సుమారు రూ. 2,48,25,000 ఉంటుందని అంచనా వేశారు. గంజాయిని తల్లేడ మండలం, గోపాల్‌పేట్ గ్రామంలో ఉన్న ఏవీఎం కేంద్రం లిమిటేడ్‌లో దహనం చేశారు. కొత్తగూడెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 25 కేసుల్లోని 337.790 కేజీల గంజాయిని, పాల్వంచ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 15 కేసుల్లోని 408.371 కేజీల గంజాయిని, మణుగూర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 52.520 కేజీల గంజాయిని, ఇల్లందు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 10 కేసుల్లోని 108.372 కేజీల గంజాయిని, ఆశ్వరావుపేట్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో 2 కేసుల్లోని 37.500 కేజీల గంజాయిని దహనం చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. గంజాయిని దహనం చేస్తున్న సమయంలో డిప్యూటీ కమిషనర్ జనార్థన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ గణేష్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్యతో పాటు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల సీఐలు పాల్గొన్నారు. ఒకవైపు గంజాయిని పట్టుకుంటూనే మరో వైపు పట్టుకున్న గంజాయిని కాల్చి వేయిస్తున్న ఖమ్మం జిల్లా ఎక్సైజ్ అధికారులను ఎక్సైజ్ ఎన్ ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అభినందించారు.

# ప్రజలకు యాంటీ బయోటిక్స్ వాడకంపై అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి



**ఖమ్మం సిటీ, నవంబర్ 18, మహా :** యాంటీ బయోటిక్స్ అనవసరంగా వాడితే శరీర ఆరోగ్య వ్యవస్థకు తీవ్ర నష్టం కలుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి అన్నారు. ప్రపంచ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల సందర్భంగా స్థానిక మామిళ్లగూడెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. అనవసరంగా యాంటీ బయోటిక్స్ వాడటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గి, రాబోయే కాలంలో గంభీరమైన ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయన్నారు. రోగాలు తగ్గకపోవడం, మందులు పనిచేయకపోవడం వంటి సమస్యలకు మన ఆచరణలు కారణమవుతాయన్నారు. ఆరోగ్య రక్షణకు అర్హత కలిగిన డాక్టర్లు సూచించిన విధంగా మాత్రమే యాంటీ బయోటిక్స్ వాడాలని ఆమె స్పష్టం చేశారు. డాక్టర్ సూచన మేరకు ఎంత కాలం వాడాలో అంతకాలం వాడితేనే ఆ మందులు సక్రమంగా పనిచేస్తాయని తెలిపారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపులు యాంటి బయోటిక్స్ విక్రయించరాదని మెడికల్ షాపుల యజమానులకు సూచనలు చేశారు. ఈ అవగాహన కార్యక్రమం నవంబర్ 24 వరకు కొనసాగనుందని, ప్రజలందరూ తమ ఆరోగ్యం కోసం యాంటీ బయోటిక్స్ వినియోగంలో జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందికి ఆమె ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, వైద్యాధికారి డాక్టర్ కృష్ణ చైతన్య, డెమో జి. సాంబశివ రెడ్డి, టి. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# శివాలయానికి పోటెత్తిన భక్తజనం



**పాలేరు, నవంబర్ 18, మహా:** పాలేరు నియోజకవర్గంలో దేవాలయాల్లో భక్తజనంతో కిటకిటలాడాయి. కార్తికమాసం, మూడవ సోమవారం కావడంతో శివ క్షేత్రాలు శివనామస్మరణతో మారుమోగాయి. నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో మహా పుణ్యక్షేత్రమైన కూసుమంచి శివాలయం(శ్రీ గణపేశ్వరాలయం), జీళ్ళ చెరువు శివాలయం, ఖమ్మం రూరల్ మండలం కూడలిలో సంగమేశ్వర దేవాలయం తదితర దేవాలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. కూసుమంచి శివాలయంలో ఈవో శ్రీకాంత్, దేవాలయ చైర్మన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో ప్రత్యేకంగా అభిషేకాలు చేశారు. ఆలయ పూజారి శేషగిరి శర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జామున రెండు గంటల నుంచి శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. కూసుమంచి శివాలయానికి ఖమ్మం జిల్లాతో పాటు నల్గొండ, సూర్యాపేట, హన్మకొండ, మహబూబాబాద్, వరంగల్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భారీగా భక్తులు శివాలయానికి వచ్చి పూజలు చేశారు. వేలాధి మంది భక్తులు తరలిరావడంతో కూసుమంచి శివాలయంలో భక్తజనంతో పోటెత్తింది. అలాగే జీళ్ళచెరువులోని శివాలయంలో అర్చకులు చిలకమర్రి స్వామినాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా పూజలు చేశారు. వందలాది మంది భక్తులు తరలి వచ్చి పూజలు చేశారు. అభిషేకాలు చేశారు. దేవాలయం వద్ద మహిళలు దీపాలను వెలిగించి పూజలు చేశారు.

# టీఆర్ఆర్ హాస్పిటల్ జనప్రాచుర్యం పొందాలి

- ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం సిటీ, నవంబర్ 18, మహా :** నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన టీఆర్ఆర్ ఆర్థో, యాక్సిడెంట్ కేర్ హాస్పిటల్ జనం విశ్వాసాన్ని చూరగొని బాగా ప్రాచుర్యం పొందాలని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. సోమవారం ఆయన.. అత్యవసర సేవల విభాగం, ఆపరేషన్ థియేటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. అందరికీ అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తూ మంచి పేరు సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ తోట లక్ష్మణ్ కుమార్ దంపతులకు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు తోట రామారావు, గోవిందమ్మ దంపతులు, కార్పొరేటర్ శీలంశెట్టి రమ, శీలంశెట్టి వీరభద్రం, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్, నాయకులు మిక్కిలినేని నరేందర్, పలువురు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు



**ఖమ్మం, నవంబర్ 18, మహా:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ లీడర్ కేఆర్ సురేష్ రెడ్డి, డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర, విప్ దీవకొండ దామోదర్ రావు తదితర ప్రముఖులు లగచర్ల ఫార్మా బాధితులతో కలిసి ఢిల్లీలో సోమవారం మానవ హక్కుల కమిషన్ ఛైర్ పర్సన్ విజయభారతితో సమావేశమయ్యారు. తెలంగాణలోని వికారాబాద్ జిల్లా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు వ్యవసాయ భూములను తమకు ఏ మాత్రం ఇష్టం లేకున్నా బలవంతంగా స్వాధీనం చేసుకుంటున్నారంటూ బాధిత రైతులు మానవ హక్కుల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. భూములిచ్చేందుకు తాము సిద్ధంగా లేకపోవడంతో రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు పోలీసుల చేత భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయిస్తున్నారని, జైల్లో నిర్బంధిస్తున్నారని, భౌతికదాడులకు దిగుతున్నారని కమిషన్ ఛైర్ పర్సన్ విజయభారతికి బాధిత మహిళా రైతులు వివరించారు. తమపై జరుగుతున్న దౌర్జన్యాలను అరికట్టాలని, అక్రమ కేసులను ఉపసంహరింపజేయాలని, భూములతోపాటు తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. ఛైర్ పర్సన్ విజయభారతిని కలిసిన వారిలో ఎంపీలు సురేష్ రెడ్డి, రవిచంద్ర, దామోదర్ రావులతోపాటు మాజీ ఎంపీ మాలోతు కవిత, ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఎమ్మెల్యే కోవా లక్ష్మీ, మాజీ ఎమ్మెల్యేలు రవీందర్ కుమార్, హరిప్రియ హరిసింగ్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు రాంచందర్ నాయక్, రూప్ సింగ్ ఉన్నారు.

# 48గంటల్లోనే రైతు ఖాతాలో నగదు జమ

- ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం రూరల్, నవంబర్ 18, మహా :** ధాన్యం అమ్మిన 48 గంటల్లోనే రైతు ఖాతాలో నగదును తెలంగాణ ప్రభుత్వం జమ చేస్తుందని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి అన్నారు. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తెలిపారు. సోమవారం రూరల్ మండలం ఏదులాపురం సొసైటీ పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామపంచాయతీ వాల్యా తండాలో ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తో కలిసి ధాన్యం తేమ శాతాన్ని, కాంటాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కొనుగోలు వేగంగా నిర్వహించాలని అన్నారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ బాబు, కాంగ్రెస్ ఖమ్మం రూరల్ మండలాధ్యక్షులు కళ్లెం వెంకటరెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, నాయకులు నాగండ్ల శ్రీనివాసరావు, పలువురు ప్రజా ప్రతినిధులు, సాధిక్ అలీ కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.


# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్3 పరీక్షలు



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 18, మహా :** గ్రూప్ 3 పరీక్షలు సోమవారంతో ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా అధికారుల ప్రత్యేక పర్యవేక్షణలో గ్రూప్ త్రీ పరీక్షలను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటల నుండి 12.30 వరకు ఒక పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుండి 5:30 వరకు రెండవ పరీక్ష, సోమవారం ఉదయం 10 గంటల నుండి 12:30 వరకు మూడవ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 సెంటర్లలో పరీక్ష నిర్వహించగా కొత్తగూడెంలో 26 సెంటర్లు, పాల్వంచలో 13 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 13478 మంది అభ్యర్థులకి గాను 7166 మంది హాజరయ్యారు, 6312 మంది గైర్హాజరయ్యారు. 53.17 హాజరు శాతం నమోదయింది. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్ రాజ్ పరీక్షా సరళని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పలు సెంటర్లను తనిఖీ చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్ష కేంద్రంలోనికి అనుమతించారు. బయోమెట్రిక్ విధానం ఉండడంతో అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి అర్ధగంట ముందే చేరుకున్నారు. వైద్య, పారిశుద్ధ్య, విద్యుత్ శాఖ అధికారులతోపాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాల నుంచి కొత్తగూడెం, పాల్వంచలకు ప్రత్యేక బస్సులు నడిపారు. అధికారులు పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూయించారు. పోలీసు యంత్రాంగం పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసింది. ప్రతి అభ్యర్థిని తనిఖీ చేసిన అనంతరం మాత్రమే లోపటికి అనుమతించారు. ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. పరీక్షల నిర్వహణ కోసం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు శిక్షణ అందించారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# కాల్ సెంటర్ ఫిర్యాదులను డిజిటలైజ్ చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, నవంబర్ 18, మహా :** కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు డిజిటలైజ్ చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లో ఉన్న కాల్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కాల్ సెంటర్ లో నమోదైన ఫిర్యాదుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే, ధాన్యం కొనుగోలు, పత్తి కొనుగోలులో ప్రజలకు, రైతులకు ఏదైనా సమస్యలు ఉంటే కాల్ సెంటర్ టోల్ ఫ్రీ నెంబర్ 1077 కు ఫోన్ చేసి ఫిర్యాదు నమోదు చేయాలని, ఆ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. 1077 కు వచ్చే ప్రతి ఫిర్యాదులను డిజిటలైజేషన్ చేసి ప్రతిరోజు నివేదిక అదనపు కలెక్టర్ కు అందించాలని కలెక్టర్ అన్నారు. కాల్ సెంటర్ కు వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారం లభించేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, కాల్ సెంటర్ ఇంచార్జ్ రజిత, అధికారులు, తదితరులు ఉన్నారు.

# రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టండి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ఖమ్మం, నవంబర్ 18, మహా :** వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సూర్యాపేట జిల్లా ఐకేపీ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులతో మాట్లాడి, వారికి కావలసిన అన్ని రకాల అవసరమైన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంచి ధర లభించడానికి రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని మంత్రి సూచించారు. తగిన సమయంలో చెల్లింపులు జరిపేలా పర్యవేక్షణ నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి అధికారులు అందుబాటులో ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

# ఇంటింటి సర్వేలో ములుగు జిల్లా ఫస్ట్

■ సమగ్ర కుటుంబ సర్వేలో అందరూ భాగస్వాములైనందుకు కృతజ్ఞతలు
■ రాష్ట్ర మంత్రి సీతక్క అభినందనలు



**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ములుగు జిల్లాలో 87.1 శాతంతో మొదటిస్థానంలో నిలిచినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి దన్సరి అనసూయ (సీతక్క) సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ కుల సర్వేలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోనే ములుగు జిల్లా మొదటి స్థానంలో నిలవడం అధికారుల పనితీరుకు నిదర్శనమన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు, సర్వేలో భాగస్వాములుగా ఉన్న ప్రజలకు మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు. దేశ చరిత్రలోనే అపూర్వమైన రీతిలో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సమాజ సంక్లిష్టత, మౌలిక సమస్యలకు అద్దం పట్టేలా ఈ సర్వే జరుగుతుందని, సమగ్ర కుటుంబ సర్వే ద్వారా ఇచ్చిన వాస్తవిక అంచనాలు నూతన రాష్ట్ర ప్రభుత్వానికి దిశా నిర్దేశన చేయడమే కాకుండా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రజలు ప్రధానంగా భూమి, నీరు, నీడ, ఉపాధుల కోసం తపిస్తున్నారనే విషయం సర్వే నిగ్గు తేలుస్తుందని, ఆ లక్ష్యాల సాధనకు అన్ని వర్గాలను కలుపుకొని సమష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని వెల్లడించారు. సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలు అందరూ భాగస్వాములు కావాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# మద్దతు ధరపై పత్తి కొనుగోలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**ఖమ్మం, నవంబర్ 18, మహా:** జిన్నింగ్ మిల్లులకు వచ్చే పత్తి పంటను మద్దతు ధరపై కొనుగోలు చేయాలని, తేమ శాతం ఆధారంగా రైతులకు చెల్లింపులు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ జిన్నింగ్ మిల్లును అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, పత్తి పంట ఎన్ని ఎకరాలలో పండించారు, ఎప్పుడు తీసుకొని వచ్చారు, తేమ శాతం ఎంత ఉంది, మొదలగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పత్తి పంట 8 శాతం తేమ ఉంటే క్వింటాల్ 7521 రూపాయల మద్దతు ధర వస్తుందని, 8 నుంచి 12 శాతం వరకు పెరిగే ఒక్కో శాతానికి 75 రూపాయలు చొప్పున క్వింటాల్ కు మద్దతు ధర తగ్గించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిన్నింగ్ మిల్లుకు వచ్చిన తర్వాత తేమ శాతం రానిక్కడే రైతులు రవాణా ఖర్చులు నష్టపోతున్నారని, గ్రామాల వద్ద, రైతుల పొలాల వద్దే తేమ శాతం పరిశీలించేందుకు గల అవకాశాలను పరిశీలించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. పత్తి పంట అధికంగా పండే గ్రామాలలో అదనంగా తేమ శాతం యంత్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రైవేట్ వ్యాపారస్తులు తేమ శాతం చూడకుండా కొంటున్నారని, దీని వల్ల రైతులు నష్టపోతారని, రైతులు పత్తి పంట ఆర బెట్టుకుని సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధరకు పత్తి విక్రయించాలని, మద్దతు ధర కంటే ఎక్కువ వస్తేనే ప్రైవేట్ వ్యాపారస్తులకు పత్తి అమ్మాలని కలెక్టర్ సూచించారు. జిన్నింగ్ మిల్లులకు వచ్చే రైతులకు టోకెన్ జారీ చేసే ఎప్పటికప్పుడు తేమ శాతం పరిశీలించి నాణ్యమైన పత్తి కొనుగోలు చేయాలని అన్నారు. కౌలు రైతుల వద్ద నుంచి కూడా పంట కొనుగోలుకు నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిన్నింగ్ మిల్లులో పత్తి ప్రాసెసింగ్, ప్యాకింగ్ తీరును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సమయంలో జిన్నింగ్ మిల్ వద్ద మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వి. హరినాథ్ బాబు, సెక్రటరీ వీరాంజనేయులు, తల్లంపాడు ఏఈఓ వి. హిమ బిందు, ఖమ్మం రూరల్ ఎం.ఏ.ఓ. జె. ఉమా నగేష్, రైతులు, తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన గ్రూప్3 పరీక్షలు

**ములుగు జిల్లా ప్రతినిధి, మహా:** టీజీపీఎస్సీ గ్రూప్ 3 పరీక్షలు సోమవారంతో ముగిశాయి. ఆదివారం రెండు పరీక్షలు జరుగగా సోమవారం మూడోపేపర్ పరీక్ష నిర్వహించారు. ములుగు జిల్లా వ్యాప్తంగా 9కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరిగిన పరీక్షల్లో 2173మందికిగాను 1169మంది అభ్యర్థులు హాజరు కాగా, 1004 మంది హాజరు కాలేదు. అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకున్నారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు.



# హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

■ కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకోవాలి
■ బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్




**కొత్తగూడెం, నవంబర్ 17, మహా :** కొత్తగూడెం బస్టాండ్ ఎదురుగా అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలనే డిమాండ్ తో బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 30వ వార్డు మధురబస్తీలో జరుగుతున్న అక్రమ నిర్మాణంపై బీఎస్పీ ఆధ్వర్యంలో గత 6 నెలలుగా చేస్తున్న పోరాట క్రమంలో భాగంగా ఇటీవల గౌరవ హైకోర్టు చీఫ్ జస్టిస్ కు లేఖ రాయగా హైకోర్టు చీఫ్ జస్టిస్ అట్టి లేఖను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ వారికి సిఫార్సు చేయగా వారు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ ఈనెల 1వ తేదీన బిల్డింగ్ సీజ్ చేయనున్నట్లు నోటీసులు జారీ చేయగా అట్టి నోటీసుపై స్థల యజమాని హైకోర్టులో ఈనెల 5వ తేదీన రిట్ పిటిషన్ నెంబర్:31033/2024 దాఖలు చేశారని అట్టి పిటిషన్ పై గౌరవ హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ ఈనెల 7తేదీన ఇచ్చిన తీర్పులో స్థల యజమాని 08022024 న తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను 7రోజుల్లో సీజ్ చేయడం లేదా కూల్చివేయాలని మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేసినా నేటికీ అట్టి ఆదేశాలను అమలు చేయలేదని జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని గౌరవ హైకోర్టు ఆదేశాలను అమలు చేయని మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకొని,అనుమతులకు విరుద్ధంగా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,పాల్వంచ పట్టణ అధ్యక్షుడు జెట్టి ఆనందరావు, వంగా రవిశంకర్, కవిత, దీపిక తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలి

■ సన్నరకం ధాన్యానికి క్వింటాల్ కు 500 రూపాయల బోనస్
■ కొనుగోలు ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్ లో నమోదు
■ జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



**కూసుమంచి, నవంబర్ 18, మహా :** కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వెంటనే ధాన్యం నాణ్యత ప్రమాణాలు పరిశీలించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో సన్న రకం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులతో ఎన్ని ఎకరాలలో పంట సాగు చేశారు, ఎంత దిగుబడి వచ్చింది, కొనుగోలు కేంద్రాలకు పంట తెచ్చి ఎన్ని రోజులు అవుతుంది, తేమ శాతం ఎంత ఉంది, టార్పాలిన్ కవర్లు ఇస్తున్నారా, మొదలగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలలో సన్న రకం ధాన్యం కొనుగోలు రిజిస్టర్ లను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచామని అన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉంటూ పంటకు టార్పాలిన్ కవర్లు కప్పాలని కలెక్టర్ తెలిపారు. గన్ని సంచులు నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. డెలివరీ సమయంలో నాణ్యతను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నాణ్యత తక్కువ, చిరిగి ఉన్న గన్ని సంచులు వినియోగించవద్దని, సరఫరా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 99 మంది రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు పూర్తి చేశామని అన్నారు. తేమ రాగానే వడ్లకు కాంటా వేయాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఓపిఎంఎస్ లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మద్దతు ధరపై నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎటువంటి ఆలస్యం జరగడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట ఐ.కె.పి. ఇన్చార్జి కొత్త జ్యోతి, ఏ.పి.ఎం. సత్యవర్ధన్ రాజ్, ఏ.ఓ. రామడుగు వాణి, రైతులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గొంతుకలను వెలికి తీస్తాం




**నల్గొండ, నవంబర్ 17, మహా :** 'నూరేళ్ల నా ఊరు' అనే గేయ కావ్యంలో భాగస్వాములు కావడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి అనేక మట్టి గొంతులను వెలికి తీసేందుకు 243 చరణాలతో 243 మంది గాయనీ గాయకులను ఆహ్వానిస్తున్నట్లు ప్రముఖ గేయ రచయిత, వాగ్గేయకారుడు వరంగల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని స్థానిక అంబేద్కర్ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్, గాయకులు వేముల పుష్ప మాట్లాడుతూ.. కళాకారులను, గాయనీగాయకులను తాము చేపట్టే కార్యక్రమానికి ఎంపిక చేసుకునేందుకు ఊరూరా తిరుగుతూ నల్లగొండకు రావడం జరిగిందని, ఈ అవకాశాన్ని కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. 'నా నూరేండ్ల ఊరు.. ఎట్లుండెను ఆనాటి ప్రజల జీవన స్థితిగతులు ఏవిధంగా ఉన్నాయో.. సమాజం ప్రస్తుతం ఎంత మార్పు జరిగింది.. మనుషుల్లో ఎటువంటి మార్పులు వచ్చాయి.. వారి మానసిక పరిస్థితుల గురించి విశదీకరించి కవి రాసిన సుదీర్ఘ గేయ కావ్యం పాడడం కోసం కళాకారులను ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఈనెల 21న నకిరేకల్ మండల కేంద్రంలోని మూసి రోడ్డులో గల గీతా మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి కవులు, కళాకారులు, గాయనీగాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. 243 చరణాలపాటలో భాగస్వామ్యం అవ్వడానికి కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. వచ్చిన కళాకారులకు అన్ని వసతులు కల్పించడం జరుగుతుందని, రెండు రాష్ట్రాల నుంచి కళాకారులు కవులు గాయకులు పెద్ద ఎత్తున పాల్గొని, ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కవి అంబటి వెంకన్న, మద్దెల సందీప్, జూపాక శివ, గూడూరు మహేష్, లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - విజయోత్సవాలను విజయవంతం చేయాలి

■ జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 18, మహా :** ప్రభుత్వం ఏర్పడి తొలి ఏడాది కాలంలో సాధించిన విజయాలు, చేపట్టిన కార్యక్రమాలు, వివిధ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్ళుటకుగాను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజా పాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న వరంగల్ లో నిర్వహించు ప్రజా పాలన విజయోత్సవాల వేడుకలకు జిల్లా నుండి మహిళా సంఘాల మహిళలను భాగస్వాములు చేయుటకుగాను చేయాల్సిన ఏర్పాట్లపై ఆయన.. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎంపీడీవోలు, ఆర్టీసీ అధికారులు, సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19న వరంగల్ వేదికగా 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమానికి మరియు ప్రజా పాలన విజయోత్సవ వేడుకలకు జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళలను తీసుకువెళ్లాలని అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నుండి పెద్ద ఎత్తున మహిళా సంఘాల సభ్యులను ప్రజా పాలన విజయోత్సవాల వేడుకలకు హాజరు అయ్యేలా ప్రణాళికలు చేపట్టాలన్నారు. జిల్లా నుండి 12 బస్సుల్లో బస్సుకు 45 మంది చొప్పున 540 మంది మహిళలను కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. దూరంగా ఉన్న మండలా బస్సులు ఉదయం ఏడు గంటలకు, మిగిలిన మండలాల బస్సులు ఎనిమిది గంటలకు మండల కేంద్రం నుండి బయలుదేరాలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళలందరికీ ఐడీ కార్డులు అందించాలని, అదేవిధంగా ప్రతి ఐడీ కార్డు వెనకాల సంబంధిత ఏపిఎం ఫోన్ నెంబర్లు ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. బస్సుల్లో మహిళలకు త్రాగునీరు, అల్పాహారం ఏర్పాటు చేయాలని అన్నారు. అన్ని బస్సులు ఒకే రూట్లో వరంగల్ చేరుకునేలా రూట్ మ్యాప్ ను సిద్ధం చేయాలన్నారు. బస్సులన్నిటికీ బ్యానర్లు సిద్ధం చేయాలి అన్నారు. మహిళలకు నర్సంపేటలో మధ్యాహ్నం మరియు రాత్రి భోజనం సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, దానికి తగిన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళల అందరి వివరాలు మరియు ఫోన్ నెంబర్లు నమోదు చేయాలన్నారు. అన్ని మండలాల్లోనే ఏపీఎంలు తమ పరిధిలోని ఉత్సాహవంతులైన మహిళా గ్రూపు సభ్యులను గుర్తించి ఈ కార్యక్రమానికి తీసుకురావాలని అన్నారు. మహిళలు కేవలం కార్యక్రమంలో పాల్గొనటం మాత్రమే కాకుండా అక్కడ వివిధ జిల్లాలు వారు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను చూడడం ద్వారా మన జిల్లాలో కూడా ఆ ఆలోచన లు అభివృద్ధి చేసే అవకాశం ఉంటుందన్నారు. ఆర్టీసీ అధికారులను మహిళల తరలింపునకు అవసరమైన బస్సుల వివరాలు అందించాలని ఆదేశించారు. అన్ని మండలాల ఏపిఎంలు మరియు సీసీలు కార్యక్రమం అనంతరం మహిళలు ఎవరు మిగిలిపోకుండా అందరిని గమ్యస్థానాలకు చేర్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మహిళలు గమ్యస్థానం చేరుకునేంత వరకు వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మహిళలందరూ పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

## నేడే సీపీఐ(ఎం) మండల మహాసభ




**దేవరుప్పుల, నవంబర్ 18, మహా:** మండలంలోని సింగరాజుపల్లి గ్రామం తుమ్మ గార్డెన్స్ లో నేడు జరిగే సీపీఐ(ఎం) ఐదవ మండల మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సింగారపు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులు తరలివచ్చి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఐఎన్టీయూసీ సెంట్రల్ కమిటీ కార్యదర్శికి సన్మానం



**ఇల్లందు, నవంబర్ 18, మహా:** సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ) సెంట్రల్ కమిటీ కార్యదర్శిగా ఆల్ ఇండియా అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (కెకెసి) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ ఖాజా గౌస్ మోహినుద్దీన్ ను సోమవారం వర్క్ షాపు నందు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా కొత్తగూడెంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆ సంఘ జాతీయ నాయకుడు త్యాగరాజన్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఇల్లందు వైస్ ప్రెసిడెంట్ వెంకటేశ్వర్లు, సెంట్రల్ నాయకులు గోచికొండ సత్యనారాయణ, మహబూబ్, తోట వెంకటేశ్వర్లు, అన్వర్, నాయకులు భూక్యా నాగేశ్వరరావు, కంకిపాటి రామారావు, మధు, రవి నాయక్, నాగేశ్వరరావు, మేకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పేలుడు పదార్థాల వినియోగంపై అవగాహన




**కొత్తగూడెం, నవంబర్ 18, మహా :** కొత్తగూడెం ఏరియా ఆర్సిఓఏ క్లబ్ నందు సోమవారం గనులలో అనుమతించబడిన పేలుడు పదార్థాల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమేష్ ఏం సావర్కర్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సౌత్ సెంట్రల్ జోన్ సనత్ కుమార్, డిడిఎంఎస్ కమలేష్ కుమార్ వర్మ ఆధ్వర్యంలో ఎం. షాలేం రాజు, జనరల్ మేనేజర్, కొత్తగూడెం ఏరియా అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథి, విశిష్ట అతిథులచే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బొగ్గు గనులలో బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో తమ అమూల్యమైన ప్రాణాలను కోల్పోయిన ఉద్యోగులకు 2 నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే అందరితో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కేజీ తివారి, జీఎం సేఫ్టీ కొత్తగూడెం రీజియన్, ఎస్ఓటు జీఎం జీవీ కోటిరెడ్డి, ఇంచార్జ్ ఏరియా ఇంజనీర్ సూర్య నారాయణ రాజు, ఏజెంట్ బి రవీందర్, పిఓలు రమేష్, ప్రహ్లాద్, ఏరియా రక్షణ అధికారి ఎం వెంకటేశ్వరరావు, డీజీఎం (పర్సనల్) బి శివ కేశవరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి వి.శ్రీనివాస్ గారు అన్ని గనుల మేనేజర్లు, సేఫ్టీ అధికారులు తదితర ఉన్నత అధికారులు, అధికారులు, సుపర్వైజర్లు, ఆఫ్ లోడింగ్ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.


# పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

■ జీఎం శ్యాంసుందర్



**మణుగూరు, నవంబర్ 17, మహా :** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని మణుగూరు ఏరియా ఎస్ ఓ టూ జీఎం డి. శ్యాంసుందర్ అన్నారు. సోమవారం సాయంత్రం మణుగూరు మండలం తిర్లాపురం బతుకమ్మ సెంటర్ లో ఏరియా జీఎం దుర్గం రామచందర్ ఆదేశానుసారం సింగరేణి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో గ్రామస్తులకు కొబ్బరి, మామిడి, జామ, పనస, నిమ్మ, బత్తాయి, సపోటా, 250 ఉచిత పండ్ల మొక్కల పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణకు సింగరేణి ఆధ్వర్యంలో మణుగూరు ప్రాంతంలో అనేక పండ్ల పూల మొక్కలు ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు. మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. గ్రామ గిరిజన యువతి ఏనిక స్వరూప ఆధ్వర్యంలో మణుగూరు ఓసీ ప్రభావిత గ్రామమైన తిర్లాపురం గ్రామస్తులకు ఉచిత మెడికల్ విటిసి శిక్షణ ఇప్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధి కూడా కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి (ఎండీఓ) శ్రీనివాస్, మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ అధికారి బి. శ్రీనివాసచారి, మేనేజర్ బి. రాజేశ్వరరావు, ఏరియా అధికార ప్రతినిధి ఎస్. రమేష్, ఏరియా పర్యావరణ అధికారి జె. శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ భాస్కర్, సతీష్, సింగరేణి సేవా సమితి సభ్యులు ఎస్ డి నా సర్ పాషా, గ్రామ పెద్దలు పాయం కామరాజు, జెడ్పీటీసీ లక్ష్మయ్య, పిసా కమిటీ అధ్యక్షులు మడి నరసింహారావు, స్వరూప, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోడు భూముల సమస్యలు పరిష్కరించండి




**ఇల్లందు, నవంబర్ 18, మహా :** పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నవారి పోడు భూముల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ నాయకుడు, అడ్వకేట్ సూర్ణపాక సత్యనారాయణ సోమవారం జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. పోడు రైతుల జీవనోపాధి అయిన పోడు భూముల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్ల శ్రీను, ఎట్టి హరికృష్ణ, ఆదూరి రవి, అప్పల మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక కేంద్రంగా రేగులగండి చెరువు



**మణుగూరు, నవంబర్ 18, మహా :** మణుగూరు మండలం కూనవరం గ్రామపంచాయతీ పరిధిలోని రేగుల గండి చెరువును పర్యాటక ప్రదేశంగా తీర్చి దిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. చెరువులో సైకిలింగ్ బోట్లు, తెడ్డు సహాయంతో నడిచే బోట్లు ఏర్పాటు చేసి గుట్టల మధ్య నీటిలో ప్రయాణించేందుకు బోట్లు ఏర్పాటు చేసి పర్యాటక కేంద్రంగా చేయాలనే ప్రణాళిక, అదేవిధంగా చినరావిగూడెం నుండి పర్ణశాల వరకు బోటు ప్రయాణం, పర్యాటక రంగ అభివృద్ధి గురించి కార్యాచరణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తహశీల్దార్, రాఘవ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ యాదగిరి, ఎంపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ



**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, నవంబర్ 18, మహా :** జిల్లాలో ప్రస్తుత వానాకాలం రైతులు పండించిన ధాన్యం సేకరణ చేయుచున్న ప్రభుత్వ ఏజెన్సీలు డీసీఎంఎస్, జీసీసీ, ఐకేపీ పీఏసీఎస్ ల ద్వారా జిల్లాలో కొనుగోలు చేస్తున్న కేంద్రాలను సోమవారం జిల్లా కలెక్టర్ జితేశ్ పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పినపాక మండలం ఉప్పాక గ్రామములో డీసీఎంఎస్ ద్వారా నిర్వహిస్తున్నటువంటి కేంద్రాన్ని తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాలను స్వయంగా తనిఖీ చేశారు. పీడిఎస్క్ రిమూవర్ తో బియ్యాన్ని వేరు చేసి అందులో సరియైన బియ్యపు గింజని పొడవు వెడల్పుని కెర్నర్ కేలిఫర్ కొలిచి సన్నరకాల పరిధిలోకి వస్తుందా రావటంలేదా అనే విషయాన్ని స్వయంగా పరిశీలించి రైతులకు అనేక సూచనలు అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్ణయించినటువంటి కనీస మద్దతు ధరతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా కల్పిస్తున్నటు వంటి బోనస్ ఐదు వందల రూపాయలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు ముందుగానే రైతుల పొలాల్లోనే పరిశీలించినాణ్యతా ప్రమాణాలు వచ్చిన తర్వాత మాత్రమే కొనుగోలు కేంద్రానికి పంపవలసినదిగా స్థానిక ఏఈఓను ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడవలసినదిగా అధికారులను ఆదేశించారు. ఆకాల వర్షాలకు ధాన్యం పాడైపోకుండా సరిపోను టార్ఫాలిన్స్ అందుబాటులో ఉంచుకోవలసినదిగా ఆదేశించారు. రైతులకు త్రాగునీరు సరఫరా చేవలసినదిగా ఆదేశించారు. ఈ కార్యక్రమములో జిల్లా సహకార అధికారి శ్రీ. కుర్షీద్ అహ్మద్, డీసీఎంఎస్ మేనేజర్, బి. తాతారావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, తహశీల్దార్, వ్యవసాయ అధికారి, మండల పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్ల పతనం.. బ్యాంకుల్లో భారీగా పెరిగిన డిపాజిట్లు..

## 15 రోజుల్లోనే రూ.2.35 లక్షల కోట్ల పెరుగుదల..!




**మహా, బిజినెస్:** అక్టోబర్ మొదటి పక్షం రోజుల్లో బ్యాంకుల నుంచి రూ.1.12లక్షల కోట్లు విత్‌డ్రా అయ్యాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాలు పేర్కొంటున్నాయి. ఇంతకు ముందు ఈ సొత్తంతా ఈక్విటీ మార్కెట్లలో పెట్టుబడిగా ఉండేది. అక్టోబర్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సెన్సెక్స్ దాదాపు ఆరు శాతం పడిపోయింది. దాంతో పెట్టుబడిదారులకు భారీ నష్టాన్ని కలిగించింది. మార్కెట్ల వరుస పతనంతో మదుపరులంతా అప్రత్తమై పెట్టుబడులను ఉపసంహరించుకొని ఆ సొమ్మును బ్యాంకులకు తరలిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (BSE) సెన్సెక్స్ 85,800 పాయింట్లకు చేరుకొని గరిష్ఠాన్ని తాకింది. ఆ సమయంలో మార్కెట్‌లోకి పెట్టుబడుల ప్రవాహం కొనసాగింది. ఆ సమయంలో లిస్టెడ్ కంపెనీల మూలధనం రూ.478లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ రికార్డు కంటే ముందు ఆగస్టు చివరిపక్షం రోజుల్లో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.215.50లక్షల కోట్లుగా ఉన్నాయని రిజర్వ్ బ్యాంక్ గణాంకాలు చెబుతున్నాయి. గణాంకాల ప్రకారం.. సెప్టెంబర్ తొలి పక్షంరోజుల్లో డిపాజిట్లు రూ.45వేల కోట్లు తగ్గి రూ.215.05 లక్షల కోట్లకు చేరాయి. కానీ, కానీ సెప్టెంబర్ చివరిలో మార్కెట్ల పతనం ప్రారంభమయ్యాక.. డిపాజిట్లు మరింత పెరిగాయి. అక్టోబర్ 4న రూ.219లక్షలకోట్లుకు చేరగా.. అక్టోబర్ 18 నాటికి రూ.218లక్షల కోట్ల ఉండగా.. ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు బ్యాంకుల మొత్తం రుణాలు రూ.4లక్షల కోట్లకు పెరిగితే.. డిపాజిట్లు రూ.5లక్షల కోట్లకు చేరాయి. ఈ ఏడాది మార్చి నుంచి అక్టోబరు వరకు బ్యాంకుల డిపాజిట్లు 7.7శాతం పెరిగి దాదాపు రూ.220 లక్షల కోట్లకు చేరుకున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో మ్యూచువల్ ఫండ్లలో మొత్తం పెట్టుబడి విలువ 25.9 శాతం పెరిగింది. అక్టోబర్ నుంచి స్టాక్ మార్కెట్ పతనం కారణంగా ఇన్వెస్టర్లు రూ.47 లక్షల కోట్లు నష్టపోయారు. సెప్టెంబర్ 27న మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 477.90 లక్షల కోట్లు ఉండగా.. ఇప్పుడు అది రూ.430.60 లక్షల కోట్లకు తగ్గింది.

### మీటింగ్‌కు రాలేదని

# సీఈవో ఆగ్రహం..

## 99 మంది ఉద్యోగులపై వేటు



**మహా, బిజినెస్:** అమెరికాకు చెందిన ఓ మ్యూజిక్ కంపెనీ సీఈవో కీలక నిర్ణయం తీసుకున్నారు. మీటింగ్‌కు హాజరు కాలేదన్న కారణంతో పెద్ద సంఖ్యలో ఉద్యోగులనుతొలగించారు. మొత్తం 110 మంది ఉద్యోగుల్లో 99 మందిపై వేటు వేశారు. సంస్థలో పనిచేస్తున్న ఓ ఇంటర్న్ ఉద్యోగి పెట్టిన రెడ్డిట్ పోస్ట్‌తో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఇటీవలే సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ సీఈవో మార్నింగ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి అందరూ హాజరు కావాలని ఆదేశించారు. అయితే, మొత్తం 110 మందిలో ఈ మీటింగ్‌కు కేవలం 11 మంది మాత్రమే హాజరయ్యారు. మిగతా 99 మంది సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సదరు సీఈవో.. ఉద్యోగులపై వేటు వేశారు. సమావేశానికి హాజరుకాని 99 మందిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఒప్పందం ప్రకారం చేయాల్సిన పనులు పూర్తిచేయడంలో, సమావేశాలకు హాజరుకావడంలో విఫలమైనట్లు పేర్కొన్నారు. ఈ కారణంచేత ఉద్యోగులతో ఉన్న ఒప్పందాలను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కంపెనీకి సంబంధించిన వస్తువులు ఏమైనా ఉంటే వాటిని వెంటనే తిరిగి ఇచ్చేయాలని ఆదేశించారు. సమావేశానికి హాజరైన ఉద్యోగులు మాత్రమే సంస్థలో ఉంటారని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీఈవో వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో స్పందిస్తున్నారు.



# ఐటీ స్టాక్స్ లాస్.. మెటల్ ఇండెక్స్ లబ్ధి..

## నష్టాలతో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు

**మహా, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 241.30 పాయింట్ల నష్టంతో 77,339.01 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 78.90 పాయింట్ల పతనంతో 23,453 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్ లో సెన్సెక్స్ 77,886.97 పాయింట్ల గరిష్టానికి దూసుకెళ్లి.. 76,965.06 పాయిట్ల కనిష్టానికి పడిపోయింది. అలాగే ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ సైతం అంతర్గత ట్రేడింగ్ లో 23,606.80 పాయింట్ల నుంచి 23,350.40 పాయింట్ల మధ్య తచ్చాడింది. నిఫ్టీ 50లోని 29 స్టాక్స్ - టీసీఎస్, ఇన్ఫోసిస్, బీపీసీఎల్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, సిప్లా 3.11 శాతం వరకూ నష్టపోయాయి. మరోవైపు హిందాల్కో, హీరో మోటో కార్ప్, టాటా స్టీల్, నెస్లే ఇండియా, హిందూస్థాన్ యూనీ లివర్ సహా 21 స్టాక్స్ 3.79 శాతం వరకూ లాభ పడ్డాయి. ఎస్బీఐ తన 15 ఏండ్ల ఇన్ ఫ్రాస్ట్రక్చర్ బాండ్లు 7.23 శాతం వృద్ధితో రూ.10 వేల కోట్ల నిధులు సేకరించింది. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 0.53 శాతం నష్టపోతే నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ ఫ్లాట్ గా ముగిసింది. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2.32 శాతం నష్టపోగా, కొఫోర్జ్ పెర్సిస్టెంట్ సిస్టమ్స్, హెచ్ సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, ఎల్టీటీఎస్, నిఫ్టీ మీడియా, నిఫ్టీ ఫార్మా, సీపీఎస్ఈ, నిఫ్టీ హెల్త్ కేర్ ఇండెక్సులు నష్టాలతో ముగిశాయి. మరోవైపు, నిఫ్టీ ఎఫ్ఎంసీజీ, నిఫ్టీ మెటల్, నిఫ్టీ బ్యాంకింగ్, నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ ఫైనాన్సియల్, నిఫ్టీ కన్జూమర్ డ్యూరబుల్ ఇండెక్సులు 1.90 శాతం లాభాలతో ముగిశాయి.

# నాలిక్కర్చుకున్న ఫాక్స్‌కాన్..

## ఇక ఆ పని చేయొద్దని స్పష్టమైన ఆర్డర్..!




**మహా, బిజినెస్:** ఐఫోన్ల అసెంబ్లింగ్ సంస్థ ఫాక్స్‌కాన్ తన పొరపాటును సరిదిద్దుకుంటున్నది. భారత్‌లో ఐఫోన్ అసెంబ్లింగ్ వర్కర్ల నియామక ప్రక్రియ చేపడుతున్న ఏజెన్సీ సంస్థలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆపిల్ ఐఫోన్ల అసెంబ్లింగ్ కోసం ఉద్యోగ నియామకాలకు జారీ చేసే వాణిజ్య ప్రకటనల్లో వయస్సు, లింగం, వైవాహిక స్థితి గురించి పేర్కొనరాదని స్పష్టం చేసింది. వివాహిత మహిళలకు అదనపు బాధ్యతలు ఉన్నాయన్న పేరుతో వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి ఫాక్స్‌కాన్ నిరాకరిస్తున్నదని గతంలో వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన కేంద్రం.. విచారించి తమకు నివేదిక అందజేయాలని రీజనల్ చీఫ్ లేబర్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో గతేడాది జనవరి నుంచి ఈ ఏడాది మే వరకూ తమకు ఉద్యోగుల నియామక బాధ్యతలు నిర్వర్తించిన భారత్ ఏజెన్సీలను.. వాణిజ్య ప్రకటనల్లో తమ పేర్లు వాడొద్దని, ప్రామాణికంగా విధి విధానాల్లో మార్పు చేయాలని ఫాక్స్ కాన్ ఆదేశించినట్లు సమాచారం. అలాగే నియామక సంస్థలు మీడియాతో మాట్లాడవద్దని, అలా మాట్లాడితే వారి కాంట్రాక్టులు రద్దు చేస్తామని ఫాక్స్ కాన్ హెచ్చరించినట్లు తెలుస్తున్నది. అంతే కాదు నియామక వాణిజ్య ప్రకటనల్లో ఫాక్స్ కాన్ పేరు వాడొద్దని పేర్కొన్నట్లు సమాచారం.



# దేశం-విదేశం NATIONAL NEWS



### ర్యాగింగ్ పేరిట మూడు గంటలు

## నిల్చోబెట్టిన సీనియర్లు.. వైద్య విద్యార్థి మృతి



**మహా, జాతీయం:** గుజరాత్ రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. సీనియర్ల ర్యాగింగ్‌కు ఓ వైద్య విద్యార్థి బలయ్యాడు. పటాన్‌లోని ధర్‌పూర్‌లో గల జీఎమ్ఈఆర్ఎస్ మెడికల్ వైద్య కళాశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. అనిల్ మథానియా అనే విద్యార్థి జీఎమ్ఈఆర్ఎస్ మెడికల్ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అయితే, శనివారం రాత్రి ఫస్ట్ ఇయర్ విద్యార్థులతో సీరియర్లు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాగింగ్‌కు పాల్పడ్డారు. ర్యాగింగ్‌లో భాగంగా అనిల్‌ను సీనియర్లు దాదాపు మూడు గంటల పాటు నిలబెట్టారు. దీంతో అనిల్ ఒక్కసారిగా అపస్మారకస్థితిలోకి చేరుకుని కుప్పకూలిపోయాడు. తోటి విద్యార్థులు వెంటనే అతిన్ని ఆసుపత్రికి తరలించినా ఫలితం లేదు. చికిత్స పొందుతూ అనిల్ ప్రాణాలు కోల్పోయాడు. ఘటన అనంతరం సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్ వల్లే అనిల్ మరణించాడంటూ అతడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడిన సీనియర్ విద్యార్థులపై మేనేజ్‌మెంట్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. సదరు విద్యార్థులను హాస్టల్, కళాశాల నుంచి సస్పెండ్ చేసినట్లు మెడికల్ వైద్య కళాశాల అధికారులు తెలిపారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ ర్యాగింగ్‌కు పాల్పడిన విద్యార్థులపై ఈ చర్యలు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# నిన్న ఆప్‌కు కైలాశ్ గెహ్లాట్ రాజీనామా..

## నేడు బీజేపీలో చేరిక

**మహా, జాతీయం:**
అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఆ పార్టీ కీలక నేతగా వ్యవహరించిన అశోక్ గెహ్లాట్ నిన్న ఆప్‌కు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన బీజేపీలో చేరారు. ఢిల్లీలోని ఆప్ ప్రభుత్వంలో కైలాశ్ గెహ్లాట్ రవాణా శాఖ మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. అయితే, ఆదివారం ఆయన పార్టీకి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను ముఖ్యమంత్రి ఆతిశీ ఆమోదించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఇక రాజీనామా అనంతరం ఆయన బీజేపీలో చేరుతారంటూ వార్తలు వచ్చాయి. ఆ వార్తలను నిజం చేస్తూ ఇవాళ కమలం పార్టీలో చేరారు. కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఢిల్లీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవ్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. కాగా, రాజీనామా సందర్భంగా ఆప్ ప్రభుత్వంపై కైలాశ్ గెహ్లాట్ తీవ్ర ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఢిల్లీ ప్రభుత్వం అసంపూర్తి హామీలు ఇస్తోందన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాటం చేయాల్సిన పార్టీ సొంత రాజకీయ అజెండా కోసం పాకులాడుతున్నదని ఆరోపించారు. తాజా పరిణామంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లైంది.



# 2025లో పది వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించనున్న రైల్వేశాఖ..

## ట్రైన్ రూట్, ఫీచర్స్ డిటెయిల్స్ ఇవే..!

**మహా, జాతీయం:**
భారతీయ రైల్వేశాఖ ఎప్పటికప్పుడు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నది. ఇందులో భాగంగా వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు దేశవ్యాప్తంగా వివిధ నగరాల మధ్య దూసుకెళ్లనున్నాయి. ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ క్రమంలోనే కొత్తగా వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టబోతున్నది. సుదీర్ఘ నిరీక్షణ అనంతరం.. 202526 మధ్య నాటికి భారత్‌లో వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలుపెట్టింది. ప్రపంచస్థాయి సౌకర్యాలు, అత్యాధునిక డిజైన్‌తో తీర్చిదిద్దిన ఈ రైళ్లు సుదూర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల కోసం రైల్వేశాఖ అందుబాటులోకి తీసుకురాబోతున్నది.

ఓ నివేదిక ప్రకారం.. భారతీయ రైల్వే.. 2025 26 నాటికి పది వందే భారత్ స్లీపర్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నది. భారతదేశపు తొలి వందే భారత్ స్లీపర్ రైలు ట్రయల్ రన్ తర్వాత 2025లో ప్రారంభించే అవకాశం ఉన్నది. చెన్నైకి చెందిన ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ICF) జనరల్ మేనేజర్ సుబ్బారావు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. నవంబర్ 15 నుంచి రెండు నెలల పాటు రైళ్ల ఆసిలేషన్ ట్రయల్స్‌తో పాటు ఇతర పరీక్షలు నిర్వహిస్తామని.. ఆ తర్వాత కమర్షియల్ సర్వీస్‌లోకి తీసుకువస్తామని తెలిపారు. వందే భారత్ స్లీపర్ రైళ్లు ప్రయాణీకుల భద్రత, సౌకర్యానికి ప్రాధాన్యతనిచ్చేలా రైల్వేశాఖ తీర్చిదిద్దింది.

ఈ రైళ్లు ఆస్టెనిటిక్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారయ్యాయి. క్రాష్ బఫర్, ప్రత్యేకంగా రూపొందించిన కప్లర్‌ల వంటి అధునాతన భద్రతా పరికరాలతో అమర్చబడి ఉండనున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణికులను సురక్షితంగా ఉండేలా సామర్థ్యం ఉంటుంది. ఈ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లు ఉంటాయి. 823 మంది ప్రయాణికులు ఈ రైలు ప్రయాణించేందుకు వీలుంటుంది. ఫస్ట్ క్లాస్ ఏసీ, సెకండ్ క్లాస్ ఏసీ, థర్డ్ క్లాస్ ఏసీ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. వందే భారత్ స్లీపర్ రైలు నడిచే మార్గాలను ఇంకా ఖరారు చేయలేదు. అయితే, న్యూఢిల్లీ - పూణే, న్యూఢిల్లీ - శ్రీనగర్ తదితర మార్గాల్లో నడిపేందుకు రైల్వేశాఖ ప్రయత్నాలు చేస్తున్నది.

# మటన్ వార్ చరిత్రకెక్కింది..

## బీజేపీ ఎంపీ విందుపై అఖిలేష్ యాదవ్ విమర్శ



**మహా, లక్నో:** బీజేపీ ఎంపీ విందుపై సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్ మండిపడ్డారు. అక్కడ జరిగిన 'మటన్ వార్' చరిత్రకెక్కిందని విమర్శించారు. ఉత్తరప్రదేశ్ మిర్జాపూర్‌లోని తన కార్యాలయంలో బీజేపీ ఎంపీ వినోద్ కుమార్ బింద్ పార్టీ నేతలు, కార్యకర్తలకు శనివారం విందు ఇచ్చారు. అయితే మటన్ గ్రేవీలో మాంసం ముక్కలు లేవని బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆరోపించారు. వడ్డించే వ్యక్తిని కొందరు కొట్టారు. దీంతో ఆ విందులో గందరగోళం చెలరేగింది. బీజేపీ సీనియర్ సభ్యులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కాగా, సోమవారం మజ్‌వాన్‌లో ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఉప ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీపై ఆయన మండిపడ్డారు. 'మీ నియోజకవర్గంలో జరిగిన కొన్ని సంఘటనలు బాగా ప్రాచుర్యం పొందాయి. ఇక్కడ 'మటన్ వార్' కూడా జరిగిందని నాకు తెలియదు. వివిధ రకాల యుద్ధాలను చూశాం. ఈ మటన్ వార్ కూడా చరిత్రలో నమోదైంది' అని అన్నారు. మరోవైపు మీర్జాపూర్ జిల్లాలోని మజ్‌వాన్ నియోజకవర్గంలో నిషాద్ పార్టీ ఎమ్మెల్యే అయిన వినోద్ కుమార్ బింద్, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేసి ఎంపీగా గెలిచారు. దీంతో ఈ స్థానం ఖాళీ అయ్యింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న ఉప ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని సుచిస్మిత మౌర్యపై, భదోహి ఎంపీ రమేశ్ బింద్ కుమార్తె జ్యోతి బింద్‌ను సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) బరిలోకి దింపింది.

# ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం..!

## ఏం చర్యలు తీసుకున్నారంటూ సర్కారుపై ప్రశ్నల వర్షం..



**మహా, జాతీయం:** ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యంపై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఢిల్లీ నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో 12వ తరగతి వరకు అన్ని పాఠశాలలను మూసివేయాలని ఆదేశించింది. కాలుష్యం నియంత్రణకు ఎన్‌సీఆర్‌లోని రాష్ట్రాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. యాక్షన్ ప్లాన్ కింద కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడానికి కొంత తక్షణ అవసరమని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నాల్గో విడత ఎలాంటి ఆదేశాలు అడగకుండా తొలగించొద్దని కఠినమైన ఆదేశాలు ఇచ్చింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్ 4ని తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్‌సీఆర్ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆంక్షలను పర్యవేక్షించేందుకు తక్షణమే టీమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పింది. జీఆర్‌పీలో పేర్కొన్న చర్యలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని చెప్పింది. తదుపరి విచారణ వరకు నివారణ చర్యలను కోర్టుకు సమర్పించాలని చెప్పింది.

# పిచ్‌ల మర్మమేమిటో!

విదేశీ క్రికెట్ జట్లు భారత పర్యటనకు వచ్చినా.. టీమ్‌ఇండియా ఇతర దేశాలకు వెళ్లినా క్రికెట్ విశ్లేషకులు, విమర్శకులు, అభిమానులు, ఆటగాళ్ల చర్చ అంతా 'పిచ్'ల గురించే.. ఆతిథ్య దేశాలు తమకు అనుకూలంగా పిచ్‌లను రూపొందించుకుంటూ పర్యాటక జట్లపై ఆధిపత్యం చెలాయిస్తున్న తరుణంలో ఎవరి నిర్ణయాన్ని వాళ్లే సమర్థించుకోవడం ఈ మధ్యకాలంలో సర్వసాధారణమైంది. మరి ప్రతిష్ఠాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా ఆస్ట్రేలియా పర్యటనలో ఐదు టెస్టుల సిరీస్ సమరానికి సిద్ధమవుతోన్న రోహిత్ సేనకు కంగారూల అడ్డాలో ఎలాంటి పిచ్‌లు దర్శనమివ్వనున్నాయి? గత రెండు పర్యటనలలో భారత్ చేతిలో చతికిలపడి సిరీస్‌లను కోల్పోయిన అవమానభారంతో ఉన్న ఆసీస్.. ఈసారి పూర్తిస్థాయిలో ప్రతీకారం తీర్చుకోవాలని చూస్తున్న తరుణంలో వేదికలు ఎలా స్పందించనున్నాయి? అనేది ప్రస్తుతం భారత క్రికెట్ అభిమానుల్లో చర్చనీయాంశమైంది.

**మహా, స్పోర్ట్స్ :** ప్రతిష్ఠాత్మక బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ (బీజీటీ)కి మరో 4 రోజుల్లో తెరలేవనుంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఈనెల 22 నుంచి పెర్త్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు ప్రారంభం కానుంది. 1991-92 తర్వాత ఆస్ట్రేలియాలో భారత్ ఐదు టెస్టుల సిరీస్ ఆడనుండటం ఇదే ప్రథమం. ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన మైదానాలైన పెర్త్, అడిలైడ్, బ్రిస్బేన్, మెల్‌బోర్న్, సిడ్నీ వేదికలుగా ఈ టెస్టులు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో భారత్‌కు ఎలాంటి సవాళ్లు ఎదురుకానున్నాయి? బ్యాటింగ్, బౌలింగ్ ఫ్రెండ్లీ వికెట్లుగా పేరున్న ఆసీస్ పిచ్‌లు కంగారూలకు ఏకపక్షంగా సహకరిస్తాయా? పూర్తిస్థాయి జట్టుతో బరిలోకి దిగుతున్న ఆసీస్ పేసర్ల ధాటికి భారత్‌కు కష్టాలు తప్పవా? గత రెండు సీజన్లలో ఈ వేదికలపై భారత ప్రదర్శన ఎలా ఉంది?

### గబ్బాకు చివరి రోజులు!

ఒకప్పుడు గబ్బా (బ్రిస్బేన్)లో మ్యాచ్ అంటేనే ఆస్ట్రేలియా ఊగిపోయేది. కానీ 2032 ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న బ్రిస్బేన్.. ఈ స్టేడియాన్ని పూర్తి అథ్లెటిక్ స్టేడియంగా మార్చాలని భావిస్తున్నది. భారత్‌తో మ్యాచ్ తర్వాత మరో రెండు, మూడు టెస్టుల కంటే ఇక్కడ మ్యాచ్‌లు జరిగే అవకాశాలు తక్కువే. ఈ వేదికతో భారత్‌కు మధుర జ్ఞాపకాలున్నాయి. గత పర్యటనలో సిరీస్ 1-1తో సమం కాగా ఇక్కడ జరిగిన ఆఖరి టెస్టులో టీమ్‌ఇండియా 3 వికెట్ల తేడాతో అపూర్వ విజయం సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆసీస్ నిర్దేశించిన 329 పరుగుల ఛేదనను భారత్ 7 వికెట్లు కోల్పోయి విజయవంతంగా పూర్తిచేయడమే గాక సిరీస్‌నూ వరుసగా రెండోసారి సొంతం చేసుకుంది. గిల్ (91), పంత్ (89) భారత విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ పిచ్ పేసర్లకు అనుకూలం. 2022-23లో సౌతాఫ్రికాతో ఇక్కడ జరిగిన టెస్టు రెండు రోజుల్లోనే ముగియడం తీవ్ర విమర్శలకు తావిచ్చింది. పిచ్‌పై ఉండే గడ్డి పేసర్లకు అనుకూలంగా ఉంటుంది. 2018 నుంచి ప్రస్తుత ఆసీస్ సారథి పాట్ కమిన్స్ ఇక్కడ 6 టెస్టులాడి ఏకంగా 36 వికెట్లు దక్కించుకున్నాడు.

### మెల్‌బోర్న్ మరోసారి వరించేనా?

భారత్ గత రెండు పర్యటనలలో మెల్‌బోర్న్‌లో ఆడిన రెండు టెస్టులనూ గెలుచుకుంది. 2018లో విరాట్ కోహ్లీ, గత సీజన్‌లో అజింక్యా రహానే ఇక్కడ శతకాలు బాదారు. గిల్, సిరాజ్ టెస్టు అరంగేట్రాలు చేసింది ఇక్కడే. పేసర్లకు అనుకూలించినా ఆరంభంలో కాస్త కుదురుకుంటే బ్యాటర్లు ఇక్కడ పరుగులు రాబట్టొచ్చు. గత ఆరు సీజన్‌లలో ఆసీస్ ఇక్కడ 6 టెస్టులు ఆడితే అందులో 4 గెలిచి రెండింటిలో (ఆ రెండూ భారత్ చేతిలోనే) ఓడింది. ఇటీవల ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన మ్యాచ్‌తో పాటు పాకిస్థాన్, ఆస్ట్రేలియా వన్డే సిరీస్‌లోనూ బంతిదే ఆధిపత్యం. మొదట బ్యాటింగ్ చేసే జట్టుకు ఇక్కడ విజయావకాశాలు ఎక్కువ.



### సిడ్నీలో ఈసారి తిప్పేదెవరో?

ఆస్ట్రేలియాలోని అత్యంత పురాతన స్టేడియాల్లో ఒకటైన ప్రఖ్యాత సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ (ఎస్‌సీజీ) ఈ సిరీస్‌లో ఆఖరి టెస్టుకు ఆతిథ్యమివ్వనుంది. పేస్‌తో పాటు స్పిన్‌కూ సహకరించే ఎస్‌సీజీలో భారత్ ఆడిన గత రెండు మ్యాచ్‌లనూ డ్రా చేసుకుంది. జనవరిలో ఇక్కడ జరుగబోయే ఐదో టెస్టులో వాతావరణ ప్రభావం పర్యాటక జట్టుపై అధికంగా ఉండనుంది. 2018లో భారత విజయానికి అడ్డుపడ్డ వరుణుడు.. 2022-23లో సౌతాఫ్రికాతో మ్యాచ్‌నూ సాగనివ్వలేదు. 2018 నుంచి ఇక్కడ ఆడిన 6 టెస్టులలో ఆస్ట్రేలియా 2 గెలిచి నాలుగింటిని డ్రా చేసుకుంది. ఆసీస్ బ్యాటర్ మార్నస్ లబూషేన్‌కు ఇక్కడ (ఆరు టెస్టులలో 81.55 సగటుతో 734 రన్స్) ఘనమైన రికార్డు ఉంది.



### సీనియర్ మహిళల వన్డే ట్రోఫీకి
## కరీంనగర్ క్రికెటర్

**హైదరాబాద్, స్పోర్ట్స్:** బీసీసీఐ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే సీనియర్ మహిళల వన్డే ట్రోఫీ కోసం కరీంనగర్‌కు చెందిన యువ క్రికెటర్ కట్ట శ్రీవల్లి హైదరాబాద్ జట్టులో చోటు దక్కించుకుంది. శనివారం ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో సమావేశమైన హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) సెలక్షన్ కమిటీ.. పదిహేను మందితో కూడిన జట్టును ప్రకటించగా అందులో శ్రీవల్లి సభ్యురాలిగా ఉంది. బొమ్మకల్, శ్రీపురం కాలనీకి చెందిన కట్ట ఉమారాణిలక్ష్మారెడ్డి దంపతులు చిన్న కూతురు అయిన శ్రీవల్లి.. కరీంనగర్ నుంచి హైదరాబాద్ జట్టుకు ఎంపికైన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. శ్రీవల్లి ఎంపికవడం ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాభిమానులందరికీ గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీనివాస్‌కు మూడు స్వర్ణాలు



**హైదరాబాద్, స్పోర్ట్స్:** అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈనెల 10 నుంచి 17 దాకా జరిగిన ఆరో ప్రపంచ క్యారమ్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన కే. శ్రీనివాస్ మూడు స్వర్ణాలతో మెరిశాడు. భారత్ తరఫున పురుషుల సింగిల్స్, పురుషుల డబుల్స్, టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న శ్రీనివాస్.. మూడు విభాగాల్లోనూ అగ్రస్థానాన నిలిచి పసిడి పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను క్యారమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (క్యాట్) జనరల్ సెక్రటరీ మదన్‌రాజ్, ఉపాధ్యక్షుడు సుధాకర్ ప్రత్యేకంగా అభినందించారు.

## బోణీ కొట్టాలని..!

### నేడు గచ్చిబౌలిలో భారత్, మలేషియా ఫ్రెండ్లీ మ్యాచ్




**హైదరాబాద్, స్పోర్ట్స్:** నెలరోజుల క్రితం ఇంటర్ కాంటినెంటల్ కప్‌తో ఫుట్‌బాల్ అభిమానులను అలరించిన నగరం మరో అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యమివ్వబోతోంది. సోమవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో భారత్, మలేషియా స్నేహపూర్వక మ్యాచ్ ఆడనున్నాయి. ఈ ఏడాది ఇప్పటిదాకా 10 మ్యాచ్‌లు ఆడిన భారత్.. ఆరింటిలో ఓడి నాలుగింటిని డ్రాతో ముగించింది. నేటి మ్యాచ్‌లో అయినా గెలిచి ఈ సీజన్‌ను విజయంతో ముగించాలని భారత్ భావిస్తోంది. ఈ మ్యాచ్ కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. రాత్రి 7:30 గంటల నుంచి మ్యాచ్ మొదలుకానుంది. మ్యాచ్ ఆరంభానికి ముందు క్రీడాభిమానులను అలరించేందుకు మ్యూజికల్ ప్రోగ్రామ్‌ను ఏర్పాటుచేశారు.

## ఫార్ములా 4 రేసింగ్ చాంపియన్ అకిల్ అలీభాయ్

### గోవా ఏసెస్ జట్టుకు ఐఆర్ఎల్ ట్రోఫీ



**కోయంబత్తూరు, స్పోర్ట్స్:** ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్ (ఐఆర్ఎఫ్)లో భాగంగా జరిగిన ఫార్ములా 4 ఇండియన్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అకిల్ అలీభాయ్ చాంపియన్‌గా నిలిచాడు. ఈ సీజన్ ఆరు రౌండ్లలో విజేతగా నిలిచిన అకిల్.. ఆదివారం ఇక్కడ నిర్వహించిన చివరి రెండు రౌండ్‌లలో 2,3 స్థానాల్లో నిలిచినప్పటికీ ట్రోఫీకి అవసరమైన పాయింట్లు సొంతం చేసుకోవడంతో అతడు చాంపియన్‌గా నిలిచాడు. ప్రముఖ తెలుగు సినిమా నటుడు అక్కినేని నాగచైతన్య బ్లాక్‌బర్డ్స్‌కు యజమానిగా వ్యవహరిస్తున్న విషయం విదితమే. ఇక ఇండియన్ రేసింగ్ లీగ్ (ఐఆర్ఎల్) ట్రోఫీని గోవా ఏసెస్ జేఏ జట్టు దక్కించుకుంది. చివరి రేసులో ఆ జట్టు డ్రైవర్లు రౌల్ హైమాన్, గాబ్రియేలా జిల్కోవా 1,2వ స్థానాల్లో నిలవడమే గాక గోవా చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకోవడంలో కీలకపాత్ర పోషించారు.



# సినిమా వార్తలు MOVIE NEWS





### షారుఖ్ ఖాన్ తర్వాత ఆ రికార్డు సాధించిన
## ఒకే ఒక్కడు అల్లు అర్జున్

**మహా, సినిమా:** అభిమానుల ఎన్నో రోజుల ఎదురు చూపులకు ఫుల్‌స్టాప్ పెడుతూ పుష్పరాజ్ అంటే ఫైర్ అనుకుంటివా.. వైల్డ్ ఫైర్ అనుకుంటూ అల్లు అర్జున్ ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. అదివారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ ట్రైలర్ సెకండ్స్‌లోనే మిలియన్ల వ్యూస్‌ను సొంతం చేసుకొని యూట్యూబ్‌లో టాప్ ట్రెండింగ్‌లో కొనసాగుతుంది. అయితే ఈ సినిమా ట్రైలర్ ఈవెంట్‌కు సంబంధించి ఉత్తరాదిలో అరుదైన రికార్డును ఖాతాలో వేసుకున్నాడు అల్లు అర్జున్.

ఈ సినిమా ట్రైలర్ వేడుకను బిహార్ రాజధాని పాట్నాలోని గాంధీ మైదాన్‌లో జరిగిన విషయం తెలిసిందే. అయితే ఈ వేడుకతో అరుదైన రికార్డును నమోదు చేశాడు అల్లు అర్జున్. ఇప్పటివరకు ఉత్తరాదిలో ఏ నటుడికి రాని విధంగా.. ఒక హీరో సినిమా వేడుకకు 2 లక్షల మందికి పైగా హాజరు అయినట్లు తెలుస్తుంది. ఇంతకుముందు ఈ రికార్డు షారుఖ్ ఖాన్ పేరిటా నమోదు అయ్యింది. 2011లో షారుఖ్ నటించిన డాన్ 2 సినిమాకి పాట్నాలో ఇదే రేంజ్‌లో అభిమానులు రాగా.. ఇప్పుడు మళ్లీ అదే రేంజ్‌లో కనిపించడంతో ఇండియాకి కొత్త సూపర్ స్టార్ వచ్చాడని.. షారుఖ్ తర్వాత ఆ రేంజ్ ఉన్న హీరో అల్లు అర్జున్ మాత్రమేనని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. మరోవైపు ముంబై పుష్ప 2 ప్రమోషన్స్‌లో భాగంగా షారుఖ్ ఖాన్ చీఫ్ గెస్ట్‌గా హాజరు కాబోతున్నట్లు సమాచారం. ఒకవేళ ఇదే నిజమైతే.. ముంబై మొత్తం అట్టుడికి పోతుందని టాక్.






## అక్టోబర్ 2న కాంతారా చాప్టర్ 1

**మహా, సినిమా:** రెండేళ్ల క్రితం కన్నడలో రూపొంది, తెలుగులో అనువాదమైన 'కాంతార' చిత్రం ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో కేవలం 16కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం దాదాపుగా 450కోట్ల వసూళ్లు రాబట్టి, కన్నడ సినిమా ఖ్యాతిని పెంచింది. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ సినిమాకు బ్రహ్మరథం పట్టారు. ప్రస్తుతం ఈ సినిమాకు ప్రీక్వెల్‌గా 'కాంతార చాప్టర్ 1' రూపొందుతున్న విషయం తెలిసిందే. కదంబుల కాలంలో సాగే కథాంశంతో ఈ సినిమా ఉండనుందని తెలుస్తున్నది. రిషబ్‌శెట్టి దర్శకత్వంలో హోంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కింగరదూర్ నిర్మిస్తున్న ఈ భారీ పీరియాడిక్ డివోషనల్ యాక్షన్ థ్రిల్లర్ శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. దేశవ్యాప్తంగా భారీ అంచనాలున్న ఈ సినిమా ఎప్పుడు విడుదల అవుతుందా అని సినీ అభిమానులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న నేపథ్యంలో ఎట్టకేలకు ఈ సినిమా రిలీజ్ డేట్‌ను చిత్రబృందం ప్రకటించింది. వచ్చే ఏడాది అక్టోబర్ 2న 'కాంతార చాప్టర్ 1'ని విడుదల చేయనున్నట్టు ఆదివారం మేకర్స్ ప్రకటించారు. జయరామ్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో ఎన్టీఆర్ కూడా నటిస్తారని గతంలో వార్తలొచ్చాయి. రిషబ్ ప్లాన్ చేస్తే 'కాంతార'లో భాగం అవ్వడానికి తనకేం అభ్యంతరం లేదని తారక్ కూడా అన్నారు. మరేమవుతుందో చూడాలి.

### పుష్ప 2 ట్రైలర్‌పై ఇండస్ట్రీ అంతా పోస్టులు..
## మెగా ఫ్యామిలీ మాత్రం సైలెన్స్



భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన పుష్ప 2 ట్రైలర్ రికార్డు వ్యూస్‌తో దుసుకుపోతున్న విషయం తెలిసిందే. అయితే ట్రైలర్ చూసిన అభిమానులతో పాటు సినీ ప్రముఖులు దీనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే దర్శకులు రాజమౌళి, ప్రశాంత్ వర్మతో పాటు, హరీశ్ శంకర్, రిషబ్ శెట్టి, అనిల్ రావిపూడి, రిషబ్ షెట్టి, మెహర్ రమేష్ తదితరులు ట్రైలర్‌పై ప్రశంసలు కురిపిస్తూ పోస్టులు పెట్టారు. ఇదిలావుంటే ఈ మూవీ ట్రైలర్‌పై మెగా కాంపౌండ్ నుంచి ఒక్క పోస్ట్ కూడా రాకపోవడం విశేషం. దీంతో మెగా ఫ్యామిలీకి అల్లు ఫ్యామిలీకి మధ్య ఇంకా గొడవలు సద్దుమణిగినట్లు లేవని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభా ఎలక్షన్స్ సమయంలో నంద్యాల వైసీపీ అభ్యర్థి శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డికి మద్దతుగా.. అల్లు అర్జున్ ప్రచారం చేసిన విషయం తెలిసిందే. తన మావయ్య జనసేన పార్టీకి ఒకవైపు సపోర్ట్ చేస్తునే మరోవైపు శిల్పా రవికి మద్దతును ప్రకటించాడు బన్నీ. దీంతో ఈ వివాదం మెగా ఫ్యామిలీ అల్లు ఫ్యామిలీల మధ్య దూరాన్ని పెంచింది. దీంతో అప్పటినుంచి అల్లు అర్జున్‌ను ట్రోల్ చేస్తూ వస్తున్నారు మెగా అభిమానులు. పుష్ప చిత్రం ఆగష్టు 15 నుంచి వాయిదా పడడానికి ఇది కూడా ఒక కారణం. అయితే తాజాగా పుష్ప 2 ట్రైలర్ విడుదలయ్యాక మెగా ఫ్యామిలీ నుంచి ఒక్కరు కూడా అల్లు అర్జున్‌ను ప్రశంసిస్తూ.. పోస్ట్ పెట్టలేదు.



### రామ్ గోపాల్ వర్మకు
## హైకోర్టులో ఎదురుదెబ్బ.!

**మహా, సినిమా:** టాలీవుడ్ వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ వర్మ దాఖలు చేసిన పిటిషన్ ను హైకోర్టు కొట్టివేసింది. గత వారం రామ్ గోపాల్ వర్మపై కేసు నమోదు అయిన విషయం తెలిసిందే. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం పోలీస్ స్టేషన్‌లో ఐటీ చట్టం కింద వర్మపై కేసు నమోదు చేశారు పోలీసులు. వ్యూహం సినిమా సమయంలో టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్, నారా బ్రాహ్మణిలను కించపరిచేలా రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెట్టినందుకు గాను మద్దిపాడు టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి రామలింగం ఈ కేసును పెట్టాడు. ఇక రామలింగం ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు వర్మపై కేసు నమోదు చేశారు.

అయితే ఈ కేసుపై విచారణకు హాజరుకావాల్సిందిగా.. ఏపీ పోలీసులు వర్మకు నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసుల ప్రకారం మంగళవారం వర్మ కోర్టుకు హాజరుకావాల్సి ఉంది. అయితే అంతకంటే ముందే వర్మ ఏపీ హైకోర్టును ఆశ్రయించి క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు.

అరెస్ట్ నుంచి తనకు రక్షణ కల్పించాలని, తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో ఆయన పిటిషన్ దాఖలు చేశారు. అయితే వర్మ క్వాష్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు వర్మ చేసిన వ్యాఖ్యల పట్ల పిటిషన్ కొట్టివేసింది. అలాగే అరెస్ట్ నుంచి తాము రక్షించలేమని వర్మ న్యాయవాదికి కోర్టు స్పష్టం చేసింది. ఏదైనా ఉంటే బెయిల్ పిటిషన్ వేసుకోవాలని సూచించింది. మరోవైపు రేపటి పోలీసు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY N SREENIVAS RAO, PUBLISHED AT 1-9-18/4-1, RAMNAGAR X ROAD, HYDERABAD. PRINTED AT SRI MATHA PRINTERS,H NO 1-1-562/1,GANDHI NAGAR, HYDERABAD.
REGD NO : APTEL/2003/9316. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034